RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | గురువారం, మే 21, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 37 | పేజీలు: 8 | వెల : రూ.1



## 23న యాదగిరిగుట్టలో కేబినెట్ సమావేశం

2లో



## నేడే సరస్వతీ అంత్య పుష్కరాల ప్రారంభం

### కంచి స్వామీ శ్రీ విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాలచే తొలి పుష్కర స్నానం

హైదరాబాద్, మే20 (వాయిస్ టుడే) : కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేసింది. పుష్కర స్నానాలు మే 21 వ తేదీ నుండి 12 రోజుల పాటు (జూన్ 1 వరకు) జరగనున్నాయి. ఈ పుష్కరాలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల సందర్భంగా జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద కాయర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓ. ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను కేటాయించింది.

**కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాలచే తొలి పుష్కర స్నానం**

పుష్కరాల తొలిరోజైన 21 వ తేదీ తెల్లవారు జామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 21 వ తేదీ నుండి జూన్ 1 వతేదీ వరకు ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 90 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో నియమించారు.

## "నా చివరి కోరిక... నా శవంపై కాషాయ జెండా కప్పాలి"

2లో

- కేంద్ర మంత్రి బండి సంజయ్



## కేంద్రమంత్రి నిర్మలతో ఉప ముఖ్యమంత్రి భట్టి భేటి



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం సమావేశమయ్యారు. తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సహాయం కోరారు. ఎస్ఏఎస్సీఐ (SASCI) కింద రూ.5,000 కోట్ల ప్రత్యేక సహాయం – విద్యా రంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్ఈఎం మినహాయింపు కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా "స్కీం ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్ (SASCI)" కింద తెలంగాణ రాష్ట్రానికి అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని వివరించారు. ఉప ముఖ్యమంత్రి వెంట ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డా. గౌరవ ఉప్పల్ ఉన్నారు.

# మండుతున్న ఎండలు

## 19 జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మే 20 (వాయిస్ టుడే) : తెలంగాణ అగ్నిగుండంలా మారుతోంది. రాష్ట్రంలో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరింది. గురువారం నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరిగి 47 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో నలుగురు మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏకంగా 19 జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఎండ తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్‌లో అత్యధికంగా 45.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నల్గొండ, నిర్మల్, సిద్దిపేట, మంచిర్యాల, పెద్దపల్లి, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లో అనేకచోట్ల 45 డిగ్రీల మార్కును దాటింది. హన్మకొండ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి వంటి జిల్లాల్లో 44-45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. హైదరాబాద్ నగరంలోనూ ఎండ తీవ్రత 43 డిగ్రీలకు చేరింది.రానున్న రెండు రోజులు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, వరంగల్, జనగామ, భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45-47 డిగ్రీల మధ్య నమోదవుతాయని, ప్రజలు మధ్యాహ్నం వేళ ఇళ్లకే పరిమితం కావాలని సూచించింది. మరోవైపు నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో అక్కడ కూడా రెడ్ అలర్ట్ జారీ చేశారు.

**ఎండవేడికి ప్రమాదాలు.. అకాల వర్షాలు**

ఎండల తీవ్రతకు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఓ కారు ఇంజిన్‌లో మంటలు చెలరేగి

మిగతా 2లో

### ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని సీఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**



హైదరాబద్ (వాయిస్ టుడే) : తీవ్రమైన వడ గాలులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయకుండా ఉండాలని సీఎం సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.



## సాక్ ఐతో సోషల్ మీడియా అస్త్రం

హైదరాబాద్, మే 20, (వాయిస్ టుడే) : సోషల్ మీడియాపై నిఘా పెట్టేందుకు హైదరాబాద్ పోలీసుల చేతికి సరికొత్త అస్త్రం దొరికింది. ఏఐ సాయంతో నెట్టింట ఫేక్ ప్రచారాలు చేసేవారు, సంఘ విద్రోహ శక్తులపై ఎప్పటికప్పుడు డేగ కన్ను పెట్టనున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా 'సాక్ ఐ' పేరుతో ఏఐ యాప్‌ను ప్రారంభించారు. తాజాగా ఈ సాక్ ఐ యాప్.. దానికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ పోలీసులు.. వెల్లడించారు. ఈ సాక్ ఐతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని సీపీ సజ్జనార్ వెల్లడించారు. ప్రస్తుతం సమాజం అంతా సోషల్ మీడియాలోనే మునిగిపోయింది. ఏ విషయమైనా, మన ఆలోచనలు అయినా సోషల్ మీడియాలో పంచుకోవడం అందరికీ అలవాటుగా మారిపోయింది. అయితే ఇప్పుడు ఈ సోషల్ మీడియాలోనే ప్రమాదకరమైన సమాచారం, విద్వేషాలను రెచ్చగొట్టడం, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన విషయాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం నేరాలను అరికట్టడం, నిందితులను పట్టుకోవడం

మిగతా 2లో

# మళ్లీ "గ్రేటర్" డ్రామా షురూ




హైదరాబాద్, మే 20, ( వాయిస్ టుడే ): హైదరాబాద్ రాజకీయాల్లో మళ్లీ "గ్రేటర్" డ్రామా షురూ అయింది. ఎప్పట్నుంచో ఊరిస్తున్న జీహెచ్ఎంసీ ఎన్నికల నగారా మోగకముందే భాగ్యనగర వీధుల్లో పొలిటికల్ హీట్ మామూలుగా లేదు. పార్టీలన్నీ ఇప్పటికే క్యాలిక్యులేటర్లు.. కులాల మ్యాపులు, వాట్సాప్ వార్‌రూమ్‌లు దుమ్ముదులిపి బయటకు తీశాయి. అయితే ఈసారి అసలు ట్విస్ట్ ఏంటంటే... "మిత్రపక్షం" అనే పదానికి బీజేపీ సరికొత్త డెఫినిషన్ చెప్పబోతోందట.. నిన్నటిదాకా పక్కనే ఉండి మురిసిపోయిన జనసేనకు గట్టిగానే 'హ్యాండ్' ఇచ్చేలా ఉందనే టాక్ గట్టిగా వినిపిస్తోంది.ఇక అంతా మనదే! 2020 గ్రేటర్ ఎన్నికల్లో ఊహించని రీతిలో దూసుకొచ్చిన బీజేపీ, అప్పటినుంచి హైదరాబాద్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. "పాతబస్తీ నుంచి పటాన్‌చెరు వరకు కాషాయ జెండా" ఎగరేయాలనే కలతో ముందుకెళ్తోంది. ఇదే ఊపులో మొన్నటి అసెంబ్లీ.. నిన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా భాగ్యనగరంలో తన ఓటు బ్యాంక్‌ను గట్టిగానే పెంచుకుంది. దీంతో ఈసారి జీహెచ్ఎంసీలో ఏపీలో కలిసిన కూటమి బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి రచ్చ లేపుతాయని.. సీట్ల పంపకాలు కూడా జరిగిపోతాయని పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ తెగ ఆశపడ్డారు. మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించగానే సోషల్ మీడియాలో "హైదరాబాద్‌లో కూటమి ప్రభంజనం" అంటూ పోస్టర్లు కూడా రెడీ అయిపోయాయి. కానీ బీజేపీ మైండ్ గేమ్ వేరేలా ఉంది. "ఆంధ్రాలో ఫ్రెండ్షిప్

మిగతా 2లో



## జనగణనలో కులగణనకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎంతోకాలంగా చర్చనీయాంశంగా ఉన్న కులగణన అంశంపై కీలక పరిణామం చోటుచేసుకుంది. జనగణనలో కులగణన నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. దీంతో భవిష్యత్తులో జరిగే జనగణనలో కులాల వారీగా వివరాలు సేకరించే అవకాశాలు మరింత బలపడాయి. కులగణన ద్వారా దేశంలోని

- మిగతా 2వ పేజీలో



2లో

## చిరంజీవి గొప్ప మనసు..

ఎప్‌సెట్ టాపర్‌ను సత్కరించిన మెగాస్టార్



# చిరంజీవి గొప్ప మనసు..

## ఎప్‌సెట్ టాపర్‌ను సత్కరించిన మెగాస్టార్

హైదరాబాద్,మే 20, (వాయిస్ టుడే): నువ్వు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకో.. నిన్ను మెగాస్టార్ చిరంజీవి దగ్గరకు తీసుకెళ్లి ఆశీర్వాదం ఇప్పిస్తా" అని ఒక తండ్రి తన కూతురికి ప్రామిస్ చేశారు. పట్టుదలతో కష్టపడి చదివిన ఆ అమ్మాయి తెలంగాణ ఎప్‌సెట్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచింది. తాజాగా ఆ 'మెగా' కల కూడా నిజమైంది.తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో సంచలనం సృష్టించిన ఎం.రుషి వెనక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. రుషి తండ్రి చిన్నప్పటి నుంచి చిరంజీవికి పెద్ద అభిమాని. రుషికి కూడా మెగాస్టార్ అంటే చాలా ఇష్టం. దీంతో ఎప్‌సెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిస్తే స్వయంగా ఆయన దగ్గరకు తీసుకెళ్లి కల్పిస్తానని తండ్రి మాటిచ్చారు. కష్టపడి చదివిన రుషి స్టేట్ టాపర్‌గా నిలిచింది.రుషి సాధించిన ఈ విజయం సాధారణమైనది కాదు. ఇంజినీరింగ్ విభాగంలో గత 40 ఏళ్లుగా (1986 తర్వాత) స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఏకైక అమ్మాయిగా రుషి రికార్డు సృష్టించింది. మగపిల్లలదే హవా అనుకునే ఈ విభాగంలో ఓ అమ్మాయి టాపర్‌గా నిలవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.తనను కలవడానికి వచ్చిన ఈ యంగ్ అచీవర్‌కు మెగాస్టార్ చిరంజీవి ఘన స్వాగతం పలికారు. రుషి సాధించిన అద్భుతమైన విజయాన్ని అభినందిస్తూ ఆమెను శాలువాతో సత్కరించారు. ల్యాప్‌టాప్ బహుమానంగా ఇచ్చారు. ఇంత చిన్న వయసులోనే తండ్రి మాట కోసం అంతటి కఠినమైన పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ అధికారిణి కావాలన్నదే తన లక్ష్యమని రుషి చిరంజీవికి వివరించింది. ఆమె సంకల్పాన్ని విన్న మెగాస్టార్ ఎంతో సంతోషించారు. రుషి చదువును ఆపొద్దని.. తన నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా మొహమాటం లేకుండా అడగాలని భరోసా ఇచ్చారు.

# 23న యాదగిరిగుట్టలో కేబినెట్ సమావేశం

హైదరాబాద్, మే 20, ( వాయిస్ టుడే ): ఈనెల 21వ తేదీన తెలంగాణ కేబినెట్ భేటీ జరగనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. అయితే తాజాగా ఆ సమావేశాన్ని వాయిదా వేసింది. ఈనెల 21వ తేదీన సరస్వతి అంత్య పుష్కరాలు ఉన్న నేపథ్యంలో.. రెండు రోజుల తర్వాత నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఈ మంత్రివర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లోని సచివాలయంలో కాకుండా ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాలతోపాటు.. పాలనా పరమైన నిర్ణయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది.మొదట కేబినెట్ భేటీని ఈనెల 21వ తేదీనే నిర్వహించాలని భావించినా.. ఆ రోజు సరస్వతి పుష్కరాలు ఉండటంతో ఈనెల 23వ తేదీకి మార్చింది. ఇక అదే 23వ తేదీన యాదగిరిగుట్టలో వేద పాఠశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనుండటం గమనార్హం. మంత్రివర్గ సమావేశం అంటే రాజధాని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా.. రాష్ట్ర ప్రజలకు, పుణ్యక్షేత్రాల వద్దకు ప్రభుత్వ పాలనను తీసుకెళ్లాలనే సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలో భాగంగానే ఈ సరికొత్త ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ఇక రాష్ట్రంలోని ప్రముఖ ఆలయం, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కేబినెట్ భేటీని నిర్వహించడం విశేషం. ఈ నిర్ణయం వల్ల ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని తెలంగాణ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం.

అయితే ఇలా కేబినెట్ భేటీని హైదరాబాద్ బయట నిర్వహించడం ఇదేం తొలిసారి కాదు. గతంలో కూడా సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రివర్గ సమావేశాన్ని మేడారంలో నిర్వహించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క సారక్క జాతర సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మేడారంలోనే కేబినెట్ భేటీని ఏర్పాటు చేశారు. అక్కడే జాతరకు సంబంధించిన ఏర్పాట్లతోపాటు.. భక్తులకు సౌకర్యాలు, నిధుల విడుదలకు సంబంధించిన కీలక నిర్ణయాలకు ఆమోదం కల్పించారు.ఇప్పుడు కూడా అలాంటి వ్యూహాన్నే యాదగిరిగుట్టలోనూ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం వల్ల స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని.. వాటిపై తక్షణమే స్పందించే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బాసర సరస్వతి అంత్య పుష్కరాలు ఈనెల 21వ తేదీన ప్రారంభం కానుండటంతో.. తెలంగాణ ప్రభుత్వం బాసరలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లను చేస్తోంది. ఈ వేడుకకు చాలా మంది మంత్రులు హాజరుకానుండటంతో.. ఆ రోజున కేబినెట్ భేటీని వాయిదా వేశారు.

# మండుతున్న ఎండలు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా దగ్ధమైంది. మరోవైపు, కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు, గాలివాన బీభత్సం సృష్టించాయి. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలో గాలివానకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో గాలి దుమారానికి ఇళ్లపై రేకులు ఎగిరిపడ్డాయి. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ అకాల వర్షం కురిసింది.

### వడదెబ్బతో నలుగురి మృతి

రాష్ట్రంలో మంగళవారం వడదెబ్బకు నలుగురు ప్రాణాలు కోల్పోయారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన రైతు రాచర్ల రాజు (50), వికారాబాద్ జిల్లాకు చెందిన కార్మికుడు సామెల్ (35), ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కనక లచ్చు (52), శాంతినగర్‌కు చెందిన బిరుదుల కిరణ్‌కుమార్ (45) వడదెబ్బ తగిలి మృతి చెందారు.

# జనగణనలో కులగణనకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

వివిధ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై స్పష్టమైన డేటా అందుబాటులోకి వస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి సరైన విధానాలు రూపొందించడంలో ఇది కీలకంగా మారనుంది. అయితే, కులగణనపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దీనిని సామాజిక న్యాయం దిశగా ముఖ్యమైన అడుగుగా అభివర్ణిస్తుండగా, మరికొందరు రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ అంశాన్ని ముందుకు తెస్తున్నారని విమర్శిస్తున్నారు. దేశ రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే ఈ నిర్ణయంపై మరిన్ని వివరాలు త్వరలో వెలువడనున్నాయి.

# "నా చివరి కోరిక... నా శవంపై కాషాయ జెండా కప్పాలి"

## - కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, మే20 (వాయిస్ టుడే) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై తనకున్న నిబద్ధతను వ్యక్తపరుస్తూ, "బీజేపీలో కమిట్‌మెంట్‌తో పనిచేసే ప్రతి కార్యకర్త చివరి కోరిక ఒక్కటే... చనిపోయిన తర్వాత తన శవంపై కాషాయ జెండా కప్పాలని కోరుకుంటాడు. నాది కూడా అదే చివరి కోరిక" అని అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన సందర్భంగా కార్యకర్తలు భారీగా తరలివచ్చి "బీజేపీ జిందాబాద్", "మోదీ జిందాబాద్", "బండి సంజయ్ జిందాబాద్" అంటూ నినాదాలతో స్వాగతం పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, తాను కొత్త పార్టీ పెట్టబోతున్నాననే ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. "బండి సంజయ్ అంటే ఏమిటో రాష్ట్ర ప్రజలకు తెలుసు. ఫాల్తుగాళ్లు చేసే ప్రచారానికి స్పందించాల్సిన అవసరం లేదు" అంటూ వ్యాఖ్యానించారు. తనను కేంద్ర కేబినెట్ నుంచి బర్తరఫ్ చేస్తారనే వార్తలపై కూడా ఆయన వ్యంగ్యంగా స్పందించారు. "తెలంగాణలో బీఆర్ఎస్‌కు 17 ఎంపీలు ఉన్నాయా? ఎన్డీఏ వాళ్లతో నడుస్తుందా? బహుశా కేసీఆర్, కేటీఆర్ కలిసి నన్ను బర్తరఫ్ చేయాలని నిర్ణయించుకుని ఉంటారు" అంటూ సెటైర్లు వేశారు.

### భగీరథ్ పోక్సో కేసుపై స్పందన

తన కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై స్పందిస్తూ, "కన్న కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించిన తండ్రి ఎవరైనా ఉంటారా? విచారణకు పూర్తిగా సహకరించాలనే ఉద్దేశంతోనే నేను నా కుమారుడిని పోలీసులకు అప్పగించాను" అని తెలిపారు. తనపై, బీజేపీపై సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం జరుగుతోందని ఆరోపించిన బండి సంజయ్,



"ప్రజలు బీజేపీతోనే ఉన్నారు. ఫేక్ వార్తలను చూసి జనం నవ్వుకుంటున్నారు" అన్నారు.

### రెండు కుటుంబాలు మాట్లాడుకుని పరిష్కారం చేసుకోవాలి : ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి

ఈ కేసుపై బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కూడా స్పందించారు. "ఇది రెండు కుటుంబాల మధ్య జరిగిన వ్యవహారం. చివరకు వారు కలిసి మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకుంటారని భావిస్తున్నాను" అని పేర్కొన్నారు. బాధితురాలి కుటుంబం, భగీరథ్ కుటుంబం మధ్య గతంలో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, కలిసి పర్యటనలు కూడా వెళ్లారని తెలిపారు. ఈ వివాదం రాజకీయ రంగు పులుముకోవద్దని సూచించారు.



## మెట్రో రెండో దశ

# నిర్మాణ వ్యయంలో సగం భరించేందుకు సిద్ధం

ఢిల్లీ: మెట్రో రెండోదశ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని, నిర్మాణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తి భరించే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్‌కు సంబంధించిన వివిధ కీలక పట్టణాభివృద్ధి ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి బుధవారం ఉదయం ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఆయన నివాసంలో కలిసి చర్చించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. "హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు గురించి ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎల్అండ్‌టీ సంస్థ నుంచి మొదటిదశ ప్రాజెక్టును టేకోవర్ చేసుకున్న నేపథ్యంలో మిగిలిన రెండో దశ పనులకు సంబంధించిన డీపీఆర్, ఇతర సాంకేతిక వివరాలు అందిన తర్వాత సమగ్రంగా పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఖట్టర్ హామీ ఇచ్చారు. మెట్రో రెండో దశ విషయంలో సూత్రప్రాయంగా కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. మెట్రో రెండో దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 162 కిలోమీటర్ల పనులకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించిందని, వాటిని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతుందన్నారు.




# మళ్లీ "గ్రేటర్" డ్రామా షురూ

(మొదటి పేజీ తరువాయి)

ఓకే బ్రదర్... కానీ హైదరాబాద్ కార్పొరేషన్ మాత్రం మాదే!" అన్నట్టుగా లోపల స్క్రిప్ట్ మార్చేసిందట. తాజా పొలిటికల్ గుసగుసల ప్రకారం బీజేపీ ఈసారి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 'సింగిల్ ప్లేయర్' గేమ్ ఆడాలని డిసైడ్ అయిందట.

### త్యాగాల 'తమ్ముడు'.. లెక్కల 'అన్నయ్య'.

ఎందుకంటే 2020 గ్రేటర్ ఎన్నికల్లో అప్పటికే అభ్యర్థులను ప్రకటించి.. ప్రచారానికి సిద్ధమైన జనసేన... బీజేపీ పెద్దల మాట కోసం లాస్ట్ మినిట్‌లో వెనక్కి తగ్గింది. "పెద్దన్న కోసం త్యాగం" మోడ్‌లో అప్పట్లో సైలెంట్ అయింది. కట్ చేస్తే, ఇప్పుడు ఆంధ్రాలో కూటమి సూపర్ హిట్ అయి పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం రేంజ్‌కు వెళ్లడంతో హైదరాబాద్‌లోనూ తమకు కనీసం ఓ పాతిక, ముప్పై సీట్లయినా ఇస్తారని జనసైనికులు లెక్కలు వేసుకున్నారు. కానీ ఇక్కడే కమలనాథులు తమ పక్కా కమర్షియల్ లెక్కలు బయటకు తీశారు.తెలంగాణలో మా ఓటు... మా సీటు... మా కార్పొరేటర్.. ఇక్కడ వేరే పార్టీలకు స్పేస్ ఇస్తే మా సొంత క్యాడర్ గుస్సా అవుతుంది. పైగా ఓట్లు చీలిపోతే లాభపడేది కాంగ్రెస్, బీఆర్ఎస్సే" అని బీజేపీ ఇంటర్నల్ మీటింగ్స్‌లో తేల్చేసిందట. అంటే జనసేన పరిస్థితి ఇప్పుడు "వచ్చిన వాడిని పంపించలేక.. పోయిన వాడిని ఆపలేక" అన్నట్టుగా తయారైంది. పవన్ కళ్యాణ్ రూట్ మ్యాప్ ఏంటి..? ఇప్పుడు అసలు సిసలైన ప్రశ్న ఏమిటంటే... పవన్ కళ్యాణ్ ఈసారి కూడా "సర్దుకుపోదాం రా.. పెద్ద ల్యాండ్ స్కేప్‌లో ఆలోచించాలి" అంటూ సైలెంట్ అయిపోతారా? లేక "తెలంగాణలో జనసేన ఉనికి చాటాలంటే ఫైట్ తప్పదు బాస్!" అంటూ ఒంటరిగానే బరిలోకి దిగుతారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ జనసేన నిజంగానే ఒంటరిగా పోటీ చేస్తే ఫలితం ఎలా ఉంటుందో ఊహించడం కష్టమే. ఎందుకంటే ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోరు నడుస్తోంది. ఈ ముగ్గురు ఉద్దండుల మధ్య జనసేనకు మైక్ దొరుకుతుందా? లేక కేవలం సోషల్ మీడియా పోస్టర్లకే పరిమితం అవుతుందా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏదేమైనా గ్రేటర్ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ హైదరాబాద్ రాజకీయాలు థ్రిల్లర్ సినిమాను మించిపోయేలా ఉన్నాయి. ఇక మిగిలింది ఒక్కటే... "కూటమి ఉందా? లేదా? జనసేనకు బీజేపీ సారీ చెప్పిందా?" అన్న సస్పెన్స్‌కు అధికారికంగా ఎండ్ కార్డ్ పడటం.. చూద్దాం..

# సాక్ ఐతో సోషల్ మీడియా అస్త్రం

(మొదటి పేజీ తరువాయి)

కోసం.. పోలీసులు సోషల్ మీడియాను జల్లెడ పడుతున్నారు. కానీ రకరకాల సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు, వాటిలో కోట్ల కొద్ది అకౌంట్లను తనిఖీ చేయడం పోలీసులకు వీలు కావడం లేదు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పోలీసులు సరికొత్త టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం టెక్నాలజీలో శరవేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టేవారిపై ఉక్కుపాదం మోపేందుకు రెడీ అయ్యారు. సోషల్ మీడియా అబ్జర్వేషన్ అండ్ సైబర్ ఇంటెలిజెన్స్ (సాక్ ఐ) పేరుతో సరికొత్త ఏఐ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగించేలా.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిని గుర్తించడం, అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టేలా ఈ అత్యాధునిక టెక్నాలజీ వ్యవస్థను హైదరాబాద్ పోలీస్ ఐటీ విభాగం తయారు చేసింది. సోషల్ మీడియాపై నిఘా పెట్టేందుకు గతంలో భారీగా సిబ్బంది అవసరం అయ్యేదని.. గంటల తరబడి శ్రమించాల్సి వచ్చేదని పేర్కొన్న పోలీసులు.. ఈ సాక్ ఐ ఏఐ యాప్ ద్వారా ఇక నుంచి అన్నీ ఆటోమేటిక్‌గా జరగనున్నాయి. ఈ సాక్ ఐలోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెంట్ డ్యాష్‌బోర్డ్ ద్వారా డయల్ 100 కాల్స్.. ఇంటర్నెల్ ఇంటెలిజెన్స్ డేటా, హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రధాన సంఘటనలకు సంబంధించిన వివరాలను ఒకే చోటుకు తీసుకువచ్చి.. అధికారులకు పూర్తి అవగాహన కల్పిస్తుంది.ఇక సాక్ ఐని.. ప్రయోగాత్మక పరీక్షించగా.. అద్భుతమైన పనితీరును కనబరిచినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మొదట్లో పురానాపూల్ ఎక్స్ రోడ్ ఘటనకు సంబంధించి 85 విద్వేషపూరిత, మతపరంగా రెచ్చగొట్టేలా చేసిన అంశాలను.. గుడిమల్కాపూర్ వివాదానికి సంబంధించి పలు సోషల్ మీడియా అకౌంట్లలో ఉన్న 126 పోస్ట్‌లను ఈ సాక్ ఐ గుర్తించింది. ఇలాంటి కంటెంట్‌ను సోషల్ మీడియా నుంచి తక్షణమే తొలగించడం ద్వారా నగరంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడటమే కాకుండా.. విద్వేషాలను రెచ్చగొట్టే వారిని గుర్తించడం సాధ్యమైందని పోలీసులు తెలిపారు.మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై ఈ సాక్ ఐ సిస్టమ్ దృష్టి పెడుతుందని పోలీసులు వెల్లడించారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్.. సైబర్ బుల్లీయింగ్, స్టాకింగ్ వంటి వాటిని కూడా గుర్తించి అలర్ట్ చేస్తాయని తెలిపారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుల తీవ్రత ఆధారంగా వాటిని హై, మీడియం, లో రిస్క్ కేటగిరీలుగా విభజించి.. అభ్యంతరకర పోస్టులను తొలగించేలా ఆయా సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలకు అలర్ట్ ఇస్తుందని పేర్కొన్నారు.వివాదాస్పద సోషల్ మీడియా పోస్ట్‌లను మళ్లీ మళ్లీ షేర్ చేసే వారిని గుర్తిస్తుంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ప్రతీ ఫిర్యాదుకు ఒక యునిక్ ట్రాకింగ్ నంబర్ ఉంటుంది. ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎండ్ టు ఎండ్ మానిటరింగ్ చేస్తారు. హైదరాబాద్‌లో రోజూ జరిగే ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు, మతపరమైన ఊరేగింపులపై ముందస్తు నిఘా ఉంచేందుకు ఈవెంట్ బేస్డ్ మానిటరింగ్ ఏర్పాటు చేశారు. ఆయా కీవర్డ్స్ ఆధారంగా సోషల్ మీడియా కార్యకలాపాలను ట్రాక్ చేస్తూ.. ఏదైనా ముప్పు ఉంటే పోలీసులను అలర్ట్ చేస్తుంది.ఈ అత్యాధునిక సాక్ ఐ ఏఐ టెక్నాలజీతో పోలీసులపై పనిభారాన్ని తగ్గించడమే కాకుండా.. నేరాలకు అడ్డుకట్ట వేయడంలో సమూల మార్పులు వస్తాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘ విద్రోహ శక్తుల ఆటకట్టించేందుకు మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చేందుకు దీన్ని రూపొందించామని తెలిపారు. ప్రస్తుత టెక్నాలజీ కాలానికి అనుగుణంగా నేరగాళ్లు.. సోషల్ మీడియాలో అస్త్రంగా చేసుకుంటున్న తరుణంలో ఈ టెక్నాలజీతో వారిని సమర్థంగా ఎదుర్కొంటామన్నారు.

# జూన్ 2న కొత్త పింఛన్లు

### 2 లక్షల మందికి పంపిణీ

### అర్హుల జాబితాలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు

హైదరాబాద్: రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2న చేయూత పథకం కింద కొత్త పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాల వారీగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బుధవారం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో 42 లక్షల మంది పెన్షనర్లు ఉండగా.. మూడేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు కావడం లేదు. చనిపోయిన వారి స్థానంలో వారి భార్యలకు మాత్రమే పెన్షన్లు ఇస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకొని నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 2 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేసింది. వీటిని జూన్ 2న పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) బుధవారం అర్హుల జాబితాలు రూపొందించి పంపించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. సెర్ప్ రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్ల వివరాలను ముఖగుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) యాప్‌లో నమోదు చేస్తోంది. మరణించిన వారు, వలసవెళ్లిన వారు, జీవించి ఉన్న వారి (లైవ్‌నెస్ అథెంటికేషన్) వివరాలతో జాబితాను సిద్ధం చేస్తోంది. ఈ ప్రక్రియ నెలాఖరుతో పూర్తయ్యే వీలుంది. ఆ తర్వాత గ్రామ, వార్డు సభలు నిర్వహించి, మృతుల వివరాలను వెల్లడించి తొలగించేందుకు తీర్మానం చేస్తారు. మరోవైపు కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ జరుగుతుందని సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్ కలెక్టర్లకు ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

# బీసీ వర్గాలకు ఊరటనిచ్చిన సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

## జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి

హైదరాబాద్, మే 20: దేశ వ్యాప్తంగా కులగణనపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు బీసీ వర్గాలకు ఆశాకిరణంగా మారాయని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అన్నారు. బుధవారం కాచిగూడలో బీసీ సంఘాల సమన్వయ జేఏసీ ఆధ్వర్యంలో నర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కులగణనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేయడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు కులగణన అవసరం అని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం సామాజిక న్యాయ పోరాటానికి పెద్ద ఊరటనిచ్చిందని అన్నా. దశాబ్దాలుగా బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని, బీసీ అసలు జనాభా, వెనుకబాటుతం అవకాశాలపై సరైన గణాంకాలు బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కులగణన అంటే దేశాన్ని విభజించడం కాదని, ఇప్పటి వరకు జరిగిన అసమానతలను గుర్తించి అణగారిన వర్గాలకు న్యాయం చేయడమేనని కుమారస్వామి పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం నిజాలను



దాచకూడదన్న సుప్రీంకోర్టు సందేశాన్ని కేంద్ర ప్రభుత్వం గౌరవించి దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.




## ఆన్ లైన్ విక్రయాలకు వ్యతిరేకంగా మెడికల్ షాపుల బంద్

నాచారం (వాయిస్ టుడే):ఆన్లైన్ మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ, కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ కు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపునిచ్చిన నేపథ్యంలో హబ్సిగూడ, నాచారం, తార్నాక ప్రాంతాలలో మెడికల్ షాప్‌ల బంద్ కొనసాగుతోంది. హబ్సిగూడ - నాచారం కెమిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ ల నిర్వాహకులు హబ్సిగూడ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం హబ్సిగూడ, నాచారం ప్రాంతాల్లో ఓపెన్ చేసి ఉంచిన మెడికల్ షాప్ వద్ద నిరసన వ్యక్తం చేసి షాప్ లను బంద్ చేయించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు, రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ లు మాట్లాడుతూ ఆన్లైన్ ఫార్మసీలు ఎటువంటి భౌతిక పరిశీలన లేకుండా, నకిలీ ప్రిస్క్రిప్షన్లతో యాంటీబయాటిక్స్, మత్తు కలిగించే ప్రమాదకరమైన మందులను విక్రయిస్తూ ప్రజా ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని ఆరోపించారు. కరోనా మహమ్మారి సమయంలో మందులను హోమ్ డెలివరీ కోసం కేంద్రం తాత్కాలికంగా తెచ్చిన ఆన్ లైన్ డెలివరీ మినహాయింపు ఇప్పటికీ కొనసాగించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మందుల ను విక్రయించకుండా కొన్ని ఫార్మసీలు భారీ డిస్కౌంట్లు ఇస్తూ చిన్న వ్యాపారుల పొట్టకొడుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిబంధనలో మార్పులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ- నాచారం కెమిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట ఇంచార్జీ రోహిన్ రెడ్డి



కాచిగూడ: వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు సంఘటితంగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ అంబర్ పేట ఇంచార్జీ రోహిన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రోహిన్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో అంబర్ పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి ప్రచారం నిర్వహించాలని సూచించారు. రోహిన్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి దేవిరెడ్డి విజితారెడ్డి, లక్ష్మణ్, టీపీసీసీ సోషల్ మీడియా అంబర్ పేట నియోజకవర్గం కో ఆర్డినేటర్ రాజ్ కిరణ్ మామిడాల, తదితరులు ఉన్నారు.

## ఉత్తరాఖండ్ మాజీ సీఎం భవన్ చంద్ర ఖండూరీ మృతి

### - దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన గవర్నర్



ఉత్తరాఖండ్ మాజీ సీఎం, మేజర్ జనరల్ (రిటైర్డ్) భువన్ చంద్ర ఖండూరి మరణం పట్ల గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు లోక్ భవన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడిగా ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను గవర్నర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సాయుధ దళాల్లోనూ, ప్రజా జీవితంలోనూ భువన్ చంద్ర ఖండూరి గారు అందించిన సేవలు చిరస్మరణీయమనీ అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. భువన్ చంద్ర ఖండూరి గారి కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## ఆధ్యాత్మిక సేవలో మరో అడుగు..

### పర్స శ్యామ్ రావు దంపతుల విరాళం

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : శ్రీ భ్రమరాంబ మల్లన్న స్వామి, శ్రీ శ్రీ శ్రీ కామరాతి బీరప్ప స్వామి వార్ల కళ్యాణ (జాతర) మహోత్సవ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్ రావు ఆయన సతీమణి పద్మ దంపతులు గొల్ల ఁ కురుమ సంఘం పెద్దలకు రూ.2,00,000/- (రెండు లక్షలు) విరాళంగా అందజేశారు. జాతర మహోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు తన వంతు సహకారం అందించినందుకు సంఘం పెద్దలు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భక్తి, సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి సహకారం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.



## ఉప్పల్ భగాయత్ అభివృద్ధి పనులు

### ఉప్పల్ భగాయత్‌లో రూ.10 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభం

### ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్ల పనులకు మోక్షం హెచ్ఎండిఏ నిధులతో అభివృద్ధి పథంలో భగాయత్ ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి బుధవారంరోజు ఉప్పల్ హెచ్ఎండిఏ భగాయత్‌లో రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులను పరిశీలించారు.రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.."ఎంతో కాలంగా భగాయత్ వాసులు రోడ్ల కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాకాలం వస్తే బురదమయం, ఎండాకాలం వస్తే దుమ్ము. మా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నాం. హెచ్ఎండిఏ ద్వారా రూ.10 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభించాం. నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని కాంట్రాక్టర్లకు, అధికారులకు స్పష్టం చేశాం" అని అన్నారు.

**రాబోయే అభివృద్ధి పనులు:**

మల్టీ లెవెల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం - యువత కోసం అతి త్వరలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం - కాలనీ వాసుల శుభకార్యాల కోసం.. పార్కులు, డ్రైనేజీ, వీధి దీపాలు - దశల వారీగా పూర్తి "ఇక్కడ ఉన్న ప్రతి సమస్యను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి భగాయత్‌ను అభివృద్ధి చేస్తాం. ఉప్పల్ భగాయత్‌ను ఉప్పల్ నియోజకవర్గంలోనే ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతాం" అని రజిత గారు హామీ ఇచ్చారు.

**ప్రజా పాలనలో.. ప్రజలకు అభివృద్ధి ఫలాలు..**

ఈ కార్యక్రమం లో ఈగ సంతోష్,నిధానకవి సుధాకర్, పూజల ప్రభాకర్,లింగంపల్లి రామకృష్ణ,తుమ్మల దేవిరెడ్డి,సల్ల ప్రభాకర్ రెడ్డి,అలుగుల అనీల్ కుమార్,బల్ రెడ్డి,అల్వాల భాస్కర్,డిన్నే భీమ్ సేన్,పస్తాం శ్రీరాములు, ఈగ నవీన్ మల్లెపెల్లి చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ భగాయత్‌లో 'ఎల్వినో కేఫ్'

### ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ) ఉప్పల్ భగాయత్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎల్వినో కేఫ్'ను బుధవారం రోజు ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రజిత రెడ్డి మాట్లాడుతూ: "ఉప్పల్ అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇక్కడ యువతకు ఉపాధి కల్పిస్తూ, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే ఇలాంటి కేఫ్‌లు రావడం సంతోషకరం.యాజమాన్యానికి నా శుభాకాంక్షలు. ఎల్వినో కేఫ్ ఉప్పల్‌లో మంచి పేరు తెచ్చుకోవాలని, వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు.యాజమాన్యం అనిల్, ప్రేమ్, రంజిత్, అనిల్, జస్వ, శ్రీధర్ కు శుభాకాంక్షలు తెలిపి, కేఫ్‌ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో బండి మల్లారెడ్డి , సల్ల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల రెడ్డి,బీమ్ సీన్ , వెంకటేష్, చంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రామంతపూర్‌లోని శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో శ్రీ బీరప్ప స్వామి - కామారాతి దేవి కళ్యాణం

### పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- రామంతపూర్‌లోని శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ బీరప్ప స్వామి -- కామారాతి దేవి వారి దివ్య కళ్యాణ మహోత్సవంలో మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన స్వామివారి కళ్యాణ వేడుకలు అత్యంత అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి కళ్యాణాన్ని తిలకించి భక్తి పరవశంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.ఈ కార్యక్రమంలో రావుల బీరప్ప, రావుల జంగయ్య, సంకూరి కుమారస్వామి, వేముల తిరుపతయ్య, విజయేందర్ రెడ్డి, అశోక్, కల్మకల లింగం తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# మేస్త్రీలకు హటావో.. సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు బచావో

**5వ రోజు చేరిన నిరసన..**

**వినూత్నంగా భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం..**

**శుక్రవారం ఇంద్ర పార్క్ ధర్నా**

**చౌక్ వద్ద సెంట్రింగ్ కాంట్రాక్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ**




నాచారం (వాయిస్ టుడే):రేట్లు పెంచాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ మే రెండో వారంలో నిరవధిక సమ్మెకు పిలుపు 10 ఫీట్ల ఎత్తు జాక్ సెంట్రింగ్కు ఎస్.ఎఫ్.టి కి రూ.51 అమలు చేయాలి ప్రతి అంతస్తుకు 10 శాతం లిఫ్టింగ్ ఛార్జీలు ఇవ్వాలి బిల్డర్లు, గృహనిర్మాణదారులు సెంట్రింగ్ కాంట్రాక్టర్లతో నేరుగా ఒప్పందాలు చేసుకోవాలి

హైదరాబాద్ ఎస్టేట్ నాచారం తాపీ మేస్త్రీల మధ్యవర్తిత్వాన్ని తొలగించాలి సెంట్రింగ్ కాంట్రాక్టర్లను ఆర్థికంగా దెబ్బతీస్తున్న మధ్యవర్తుల వ్యవస్థను రద్దు చేసి, సెంట్రింగ్ పనులకు తగిన రేట్లు అమలు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. "తాపీ మేస్త్రీలకు హఠావోడ సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు బచావో" అనే నినాదంతో అసోసియేషన్ నాయకులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ నాయకులు రత్లవత్ రాములు నాయక్, సంఘముల శ్రీనివాస్ కుర్మ (వైస్ ప్రెసిడెంట్), వి. సంతోష్ నాయక్, దేవేందర్, శేఖర్, రమేష్, మధు, లక్ష్మణ్ ఠాగూర్ తదితరులు మాట్లాడుతూ 2016లో సెంట్రింగ్ పనులకు ఎస్.ఎఫ్.టి కి రూ.40గా నిర్ణయించామని, ప్రతి సంవత్సరం ఒక రూపాయి చొప్పున పెంచాలని తీర్మానించినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న రేట్లు కూడా తీవ్రంగా పడిపోయి కాంట్రాక్టర్లు నష్టాల్లో కూరుకుపోయారని పేర్కొన్నారు. మొలలు, చెక్కలు, వాల్ ప్లేట్లు, ట్రాన్స్పోర్ట్, లోడింగ్ - అన్లోడింగ్ ఖర్చులు, కార్మికుల కూలీలు భారీగా పెరిగినా సెంట్రింగ్ రేట్లు పెరగకపోవడం అన్యాయమని ఆరోపించారు. లక్షల సెంటింగ్ రూపాయల పెట్టుబడులు పెట్టి వర్కర్లకు అడ్వాన్సు ఇచ్చి పని చేస్తున్న కాంట్రాక్టర్లు కుటుంబాలను పోషించుకోవడమే కష్టంగా మారిందన్నారు. తాపీ మేస్త్రీలు సెంట్రింగ్ పనులను తమ రేట్లలో కలుపుకొని మాట్లాడటం వల్లే సెంట్రింగ్ కాంట్రాక్టర్ల రేట్లు దిగజారుతున్నాయని సంఘం ఆరోపించింది. ఎలక్ట్రిషియన్, ప్లంబర్, కార్పెంటర్లతో బిల్డర్లు నేరుగా ఒప్పందాలు చేసుకున్నట్లే సెంట్రింగ్ కాంట్రాక్టర్లతో కూడా డైరెక్ట్ మాట్లాడాలని కోరారు. సెంట్రింగ్ పనులు పెట్టుబడితో కూడుకున్నవని, నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరమవుతారని, మేస్త్రీలు మధ్యవర్తులుగా వ్యవహరించడం వల్ల బిల్డర్లు మరియు కాంట్రాక్టర్లిద్దరికీ నష్టం జరుగుతోందని తెలిపారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్లు నేరుగా బిల్డర్లు, గృహనిర్మాణదారులతో ఒప్పందాలు చేసుకుంటే రేట్లు లిఫ్టింగ్ ఛార్జీలు, ట్రాన్స్పోర్ట్ అంశాల్లో స్పష్టత తగ్గకుండా ఉండటంతో పాటు మెటీరియల్ భద్రత, ఉంటుందని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి భవన నిర్మాణాలు చేస్తున్నామని, ప్రస్తుతం చాలామంది సెంట్రింగ్ కాంట్రాక్టర్లు తమ మెటీరియల్ను స్క్రాప్కు అమ్ముకొని ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లుగా మారిపోతున్న దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు



## కపిల్ విద్యా వారధి స్కాలర్ షిప్ పరీక్షకు స్పందన

కరీంనగర్,మే 21(వాయిస్ టుడే): కపిల్ విద్యా వారధి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న స్కాలర్‌షిప్ పరీక్షలు 2025--26 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 520 మార్కులకుపై సాధించిన విద్యార్థులకు కరీంనగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో అర్హత పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 595 మంది విద్యార్థులు హాజరైనారు.ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు వారు కోరుకున్న రంగంలో స్థిరపడే వరకు ఉచితంగా భోజనం,వసతి,కాలేజీల ఫీజులు కపిల్ విద్యా వారధి సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్ భరిస్తుంది.ఈ కార్యక్రమంలో కపిల్ విద్యా వారధి పరీక్ష నిర్వాహకులు సంగోజు సత్యనారాయణ చారి,నంది శ్రీనివాస్,కూర రమేష్,గీకురు శ్రీనివాస్,శిశుమందిర్ పాఠశాల అభివృద్ధి కమిటి కార్యదర్శి కోల అన్నారెడ్డి,గట్టు శ్రీనివాస్,శ్రీరామోజు సుభాష్,వకులాదేవి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

### వెంటిలేటర్‌పై కేశవపట్నం వాసి శ్రీనివాస్

### హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స



శంకరపట్నం,మే21(వాయిస్ టుడే): నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న ఓ యువకుడిపై విధి కన్నెర్రజేసింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు.చికిత్స ఖర్చులు లక్షల్లో పెరుగుతుండగా,ఆ కుటుంబం చేతిలో చిల్లిగవ్వ లేక దాతల సహాయం కోసం వేడుకుంటోంది కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన సామల శ్రీనివాస్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.వీరికి ఐదేళ్ల కుమార్తె,9 నెలల కుమారుడు ఉన్నారు.ఈ నెల 13న విధులు ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో శంకరపట్నం మండలం ఎరడపల్లి తాడికల్ మార్గంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలు కనిపించక బైక్ అదుపు తప్పి పడిపోయాడు.ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి.స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స అందించినప్పటికీ మరుసటి రోజు పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు.అక్కడి వైద్యులు చిన్న మెదడుకు సంబంధించిన నరాలు దెబ్బతిన్నాయని,పరిస్థితి అత్యంత సీరియస్‌గా ఉందని తెలిపారు. ప్రస్తుతం కదలికలు లేక వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది.ఈ ఘటనతో శ్రీనివాస్ తల్లిదండ్రులు గౌరవ్వ మధునయ్య,భార్య సుప్రియ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చికిత్సకు రోజురోజుకు ఖర్చు పెరుగుతుండటంతో ఆ కుటుంబం దాతల సహాయం కోసం ఆశగా ఎదురు చూస్తోంది.శ్రీనివాస్ ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు,ప్రజాప్రతినిధులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడం ద్వారా అతడి ప్రాణాన్ని నిలబెట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సాయం అందించాల్సిన ఖాతా వివరాలు
పేరు: పోరండ్ల సుప్రియ, అకౌంట్. 62324674552
ఐ ఎఫ్ ఎస్ సి– SBIN0020136, బ్రాంచ్: జమ్మికుంట
ఫోన్ పే, గూగుల్ పే: 9000747938



## ఆన్‌లైన్‌లో ఔషధ విక్రయాలను నిలిపివేయాలి

తొర్రూరు, మే 20 వాయిస్ టుడే : ఆన్ లైన్ ఔషధ విక్రయాలను వెంటనే నిలిపివేయాలని కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎం గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డివిజన్ కేంద్రంలోని మెడికల్ షాపులను మూసివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆన్లైన్ ఫార్మసీ విధానం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న మెడికల్ షాపుల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అమ్మకాల్లో ఎక్కువ శాతం డిస్కౌంట్ ఇవ్వడం, ప్రిస్కిప్షన్ లేకుండానే మందులను సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఔషధాల విక్రయాలతో రిటైల్ మందుల షాపుల్లో విక్రయాలు తగ్గి మందుల దుకాణాలు కుదేలవుతున్నాయన్నారు. అలాగే డీలర్ల పరిస్థితి కూడా ఇదే పరిస్థితి ఉందని, ఆన్లైన్ ద్వారా నిషేధిత పరిమితికి మించిన ఔషధాలు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. ఒకే ప్రిస్క్రిప్షన్‌ను పలుమార్లు రిపీట్ చేస్తూ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే మందులను మోతాదుకు మించి కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని ఆరోపించారు. ఆన్ లైన్ మందుల విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి దామెర సరేష్, కోశాధికారి ముదుపు రవీందర్ రెడ్డి, ఫార్మసీల నిర్వాహకులు పాల్గొన్నారు.



## గుర్తూరులో ఘనంగా గంగమ్మ తల్లి జాతర

తొర్రూరు, మే 20 వాయిస్ టుడే : తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి జాతరను బుధవారం కన్నుల పండుగ గా నిర్వహించారు. ప్రదానం గా గంగ పుత్ర కులస్తులు డప్పు చప్పుళ్ళ నడుమ ఆట పాటల తో నృత్యాలు చేస్తూ జల బిందెలు, నైవేద్యం తో కూడిన బోనాలను దేవాలయనికి తీసుకెళ్లి గంగమ్మ విగ్రహాలను శుద్ధి చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగ పుత్ర సంఘం ముఖ్య నాయకులు పిల్లి నాగరాజు, పిల్లి వెంకన్న, సింగారం కుమార్, సింగారం శ్రీనివాస్, సింగారం చందర్, సింగారం మురళి, పిల్లి ఐలయ్య , పిల్లి శ్రీను, సింగారం రాజు,పిల్లి ఉప్పన్న, , సత్తయ్య, దయాకర్, రమేష్,విజయ్, అశోక్, శ్రీనివాస్, కిరణ్, సతీశ్, బయ్యాలు, కొమురయ్య, వెంకటయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై జాప్యం తగదు

**సమస్యలను ఇకనైనా పరిష్కరించండి**

**రాష్ట్ర ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్**

**రాష్ట్ర కేబినెట్‌లో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి**



హైదరాబాద్, మే 20: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ఈనెల 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండేళ్ళలో దాదాపు ముప్పై సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగాయని, కానీ ఇంతవరకు ఏ ఒక్క మంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై చర్చ జరపలేదని అన్నారు. కనీసం రేపు జరగబోయే మంత్రివర్గ సమావేశంలోనైనా జర్నలిస్టు ప్రధాన సమస్యలపై చర్చించి సమస్యలను పరిష్కరించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళయినా.. ఇంతవరకు కొత్త అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ పూర్తికాలేదని, జీవో 252 జారీ చేసిన గత నాలుగు మాసాల్లో మూడు సవరణలు ఆరు అభ్యంతాలు, కోర్టు కేసులతో అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ నత్తనడకలా సాగుతుందని అన్నారు.జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. హెల్త్ కార్డులు లేక అనేకమంది జర్నలిస్టులు ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్యం లబించక ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు గత రెండేళ్లుగా ప్రభుత్వం జారీచేసిన అడ్వర్టైజ్మెంట్స్ బిల్లులు ఇవ్వలేదని, బిల్లుల బకాయిలు చెల్లించకపోగా, అడ్వర్టైజ్మెంట్స్ ఇవ్వడం కూడా ఆపేసారని ఆయన ధ్వజమెత్తారు. రెండేళ్లుగా బిల్లులు రాక అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, చాలా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ళు జర్నలిస్టుల జీవితాలతో చెలగాటం ఆడిందని.. చిన్న, మధ్య తరహాపత్రికలను అణిచివేసిందని, ఈ ప్రభుత్వం కూడా అదే పద్ధతిలో వ్యవహరిస్తున్నదని మామిడి సోమయ్య విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కొత్త మీడియా పాలసీ చేస్తామని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళస్థలాలిస్తామని, అక్రెడిటేషన్ కార్డులు, ఆరోగ్య భీమా పథకం కార్డులు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్లుగా ఏదీ అమలు చేయలేదని అన్నారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపకుండా సానుకూలంగా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. రాష్ట్ర రాజధానిలో ఎటువంటి వివక్ష, వివాదం లేకుండా, సాంకేతికపరమైన సమస్యలు ఎదురుకాకుండా అర్హులైన జర్నలిస్టులందరికి త్వరితగతిన ఇళ్ళస్థలాలు కేటాయించాలని ఆయన కోరారు.



## "మొద్దు నిద్ర పోతున్న కాంగ్రెస్ సర్కారును బొందపెట్టాలి"

### -- ఎంపీ వద్దిరాజు పిలుపు

భద్రాచలం (వాయిస్ టుడే) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ముందంజలో నిలిచిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా పాత పనులకు రిబ్బన్లు కట్ చేస్తోందని విమర్శించారు. బుధవారం సాయంత్రం భద్రాచలంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యం అయోధ్య పేరును జపిస్తున్నప్పటికీ, "దక్షిణ అయోధ్య"గా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఎంపీ రవిచంద్ర ఆరోపించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు భద్రాచలం అభివృద్ధి, జిల్లాకు సంబంధించిన పలు అంశాలను పార్లమెంటులో లేవనెత్తినట్లు తెలిపారు. భద్రాచలం పరిసర 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని, రైల్వే మార్గాన్ని భద్రాచలం వరకు పొడిగించాలని, కొత్తగూడెంను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని కేంద్రాన్ని డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఖమ్మం--కొత్తగూడెం--పాల్వంచ--భద్రాచలం మీదుగా బస్తర్ వరకు రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించాలని కూడా ఆయన కోరారు. రుణమాఫీ, రైతుభరోసా అమలు కాకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, "రేవంత్ పోవాలి -- కేసీఆర్ రావాలి" అనే నినాదం ప్రజల్లో వినిపిస్తోందన్నారు. "మొద్దు నిద్ర పోతున్న కాంగ్రెస్ సర్కారును బొందపెట్టేందుకు ప్రజలతో కలిసి ముందుకు సాగాలి. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేయడానికి గులాబీ శ్రేణులంతా అంకితభావంతో పనిచేయాలి" అని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.



## మాజీ ఐడపీఆర్ డైరెక్టర్ రాజమౌళిని పరామర్శించిన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి

ఖమ్మం (వాయిస్ టుడే న్యూస్): తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ మాజీ డైరెక్టర్ రాజమౌళి ఇటీవల అనారోగ్యానికి గురై ఖమ్మం జమ్మిబండలోని శ్రీరక్ష హాస్పిటల్ రిహాబ్ బుద్ధలో చికిత్స పొందుతున్నారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ జీ. వెంకటేశ్వర్లు (జీవీ) పర్యవేక్షణలో ఆయనకు వైద్య సేవలు అందుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు బుధవారం మధ్యాహ్నం ఖమ్మం అడ్వకేట్స్ జేఏసీ చైర్మన్ బిచ్చాల తిరుమలరావుతో కలిసి రిహాబ్ బుద్ధను సందర్శించి రాజమౌళిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నేతలు, రాజమౌళి త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

## "బీఆర్ఎస్‌ను దెబ్బతీయడానికి కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కు"

**– ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**



ఖమ్మం (వాయిస్ టుడే న్యూస్): కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌ను ఏకాకిని చేసే లక్ష్యంతో కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా, కుయుక్తులు పన్నినా ప్రజాబలం దండిగా ఉన్న బీఆర్ఎస్‌ను ఆ రెండు పార్టీలు ఏమి చేయలేవని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ, పార్టీ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్ రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమన్వయకర్తల సమావేశంలో ఎంపీ రవిచంద్ర మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ లోక్‌సభ సభ్యుడు నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ముందుకు సాగాలని ఎంపీ రవిచంద్ర పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్రంతో పాటు ఖమ్మం జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రస్తుతం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రుల దృష్టి ప్రజా సమస్యల కంటే సంపాదనపైనే ఉందని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి చెప్పుకోవడానికి ఎన్నో అంశాలు ఉన్నాయని, కాంగ్రెస్ పాలనలో మాత్రం "శూన్యం" మాత్రమే కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల కేటాయింపు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అమలు చేయలేదని ఎంపీ వద్దిరాజు విమర్శించారు. విద్యార్థుల ఫీజులు చెల్లించడం లేదని, యువతకు ఉద్యోగాలు లేవని, రైతుల పంట కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

వచ్చే ఎన్నికల నాటికి ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు పెరిగే అవకాశం ఉందని, యువత, మహిళలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తమిళనాడులో యువత మద్దతుతో విజయ్ ముఖ్యమంత్రి అయ్యారని ఉదాహరణగా పేర్కొంటూ, బీఆర్ఎస్ కూడా యువత, మహిళలను మరింత ప్రోత్సహిస్తుందని చెప్పారు. "ఇంకా రెండున్నరేళ్లు కాంగ్రెస్ పాలనను ప్రజలు భరించాల్సిందే. రాష్ట్రవ్యాప్తంగా 'రేవంత్ పోవాలి -- కేసీఆర్ రావాలి' అనే నినాదం వినిపిస్తోంది" అని ఎంపీ రవిచంద్ర అన్నారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ ఎవరికి టికెట్ ఇచ్చినా అందరూ ఐక్యంగా పనిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10కి 10 స్థానాలు బీఆర్ఎస్ గెలిచేలా కృషి చేయాలని గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దిండిగల రాజేందర్, కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ, ఖమర్, పగడాల నాగరాజు, మంజుల, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బొడ్లాడలో తీవ్ర విషాదం....

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం

**మూడు కుటుంబాల కడుపు కోతతో... ఊరు కన్నీటి పర్యంతం..**

**మూడేళ్ళ క్రితం తల్లి ఇప్పుడు తండ్రి అనాధాలైన పిల్లలు...**



దంతాలపల్లి మే20(వాయిస్ టుడే):-మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ మూడు కుటుంబాల తల్లిదండ్రుల కడుపు కోత చూసి ప్రతి కుటుంబం కన్నీటి పర్యంతం చెందింది.వివరాల్లోకి వెళితే దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన ప్రమాదానికి గురైన ఈ ముగ్గురు యువకులు మంగళవారం రాత్రి సుమారుగా పది గంటల ఇరవై నిమిషాల సమయంలో ఖమ్మం- వరంగల్ జాతీయ రహదారిపై తొర్రూర్ మండలం వెలికట్ట గ్రామం శివారులో వరంగల్ వైపు ప్రయాణిస్తుండగా ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ను వేగంతో ఢీకొట్టడంతో మృతులు అక్కడికి అక్కడే మరణించారు.మృతులలో అల్లి .సంపత్(23),పొట్టకార్ల వంశీ(21),లింగమల్ల సతీష్(30) లు గా గుర్తించారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థుల్లో విషాధచాయలు అలుముకున్నాయి. మృతుడు లింగమల్ల సతీష్ కుటంబంలో ఇద్దరు పిల్లలు అనాధలుగా మారారు.మృతుడి భార్య మూడు సంవత్సరాల క్రితమే మరణించగా ఇప్పుడు పిల్లలకు అండగా ఉండి ఆలనాపాలనా చూసుకునే తండ్రి మరణించడంతో పిల్లలు అనాధలుగా మిగిలి పోయారు.పిల్లల ఆర్తనాదాలు వింటుంటే ప్రతిఒక్కరి గుండె కలిచి వేస్తుందని గ్రామస్థులు వారి బాధను వెల్లడిస్తున్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక







# సామాన్యుల నడ్డి విరిచేలా ఎన్డీఏ సర్కార్ పాలన

## కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ నిరసన
## పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను ఖండిస్తూ ఎడ్ల బండి, రిక్షా ర్యాలీ
## రాహుల్ గాంధీ హెచ్చరించినట్లే ధరల పెంపు
## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ధ్వజం
## ఎన్నికల ముందు వాగ్దానాలు, తర్వాత ధరల పెంపు
## వైద్యుల అంజన్ కుమార్

కరీంనగర్,మే 21(వాయిస్ టుడే): కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్,డీజిల్ ధరలను వ్యతిరేకిస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ మరియు కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం,కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.మేడిపల్లి సత్యం, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,వైద్యుల అంజన్ కుమార్,ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఎడ్ల బండ్ల పై ఎక్కి నిరసన తెలపగా, పార్టీ శ్రేణులు రిక్షా పై ద్విచక్ర వాహనాలను ఎక్కించి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కురాసిన వినతి పత్రమును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,సిసిసి అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,ఆకుల నరసయ్య అదనపు కలెక్టర్ కు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డా.మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ సామాన్యుల నడ్డి విరిచేలా పనిచేస్తోంది. ఇటీవల జరిగిన బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు శాసనసభ ఎన్నికల అనంతరం పెట్రోల్,డీజిల్ ఇంధన ధరలు పెరుగుతాయని తస్మాత్ జాగ్రత్త అని మా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ముందే హెచ్చరించారు. వారు చెప్పినట్లుగానే ఎన్నికలు ముగిసిన వారం రోజుల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ ఇంధన ధరలను అమాంతం పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తోంది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం. అందుకే ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ కరీంనగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు సామాన్య ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ గారు పేద ప్రజల ఉసురు పోసుకోకుండా పెంచిన పెట్రోల్,డీజిల్ ఇంధన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు, గతంలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ హయాంలో అంతర్జాతీయ స్థాయిలో బ్యారెల్ ధర ఇప్పటికంటే ఎక్కువ ఉన్నప్పటికీ సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని ఇంధన ధరలను పెంచలేదు. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం కూడా అదేవిధంగా నడుచుకోవాలి. లేనిపక్షంలో మా అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేలా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం. ధరలు తగ్గించేంత వరకు మా పోరాటం కొనసాగుతుందని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినా దేశంలో మాత్రం పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించకుండా ఎక్సైజ్ సుంకం, సెస్సుల పేరుతో ప్రజలను దోచుకుంటోందని,పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావంతో నిత్యవసరాల ధరలు తిరుగుతున్నాయని,బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానాలు ఎన్నికల తర్వాత ధరల పెంపు సిద్ధాంతాలతో పనిచేస్తుందని మండిపడ్డారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో యూపీఏ చైర్‌పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ గారి నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో నాడు అంతర్జాతీయ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినప్పటికీ దేశంలో పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు అందజేయడం జరిగిందని,కానీ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధర తగ్గినప్పటికీ ఇంధన ధరలు మాత్రం పెరుగుతూ ఉన్నాయని,దాని ద్వారా నిత్యావసర ధరలు పెరుగుతూ ప్రజల జీవనం సమస్యగా మారిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని,కేంద్రం మాత్రం ప్రజలను పట్టించుకోకుండా కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ బిజెపి పార్లమెంటు సభ్యులను అడ్డుకుంటామని, ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కటకంమృత్యుంజయం మాట్లాడుతూ ఇంధన ధరల పెరుగుదలతో రైతులు,ఆటో కార్మికులు, చిన్న వ్యాపారులు, కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై భారం వేస్తున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున రాజేందర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, ఉప్పుల అంజనీ ప్రసాద్,చాంద్ పాషా, ఎండి తాజ్,పులి ఆంజనేయులు గౌడ్ ,ముత్యం శంకర్ గౌడ్, నునావత్ భాస్కర్ నాయక్,పర్వత మల్లేశం, చాడ గొంద బుచ్చిరెడ్డి, మడుపు మోహన్,గడ్డం విలాస్ రెడ్డి,పత్తి మధు, కామ్రెడ్డి రాంరెడ్డి,బానోతు శ్రావణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం శ్రీనివాస్ గౌడ్,పడాల అజయ్ గౌడ్, గుమ్మడి రాజకుమార్, వరాల నర్సింగం,రాచకొండ ప్రభాకర్, పడిశెట్టి భూమయ్య,అహమ్మద్ అలీ, గంగుల దిలీప్,అబ్దుల్ రహమాన్, నేహాల్ అహ్మద్,కంది తిరుపతిరెడ్డి, కూర నరేష్ రెడ్డి,బొద్దుల విజయలక్ష్మి లక్ష్మణ్,సుద్దాల కమల్ గౌడ్,గుర్రం సంధ్యా తిరుపతి, తప్పట్ల రాజు, భోగొండ ఐలయ్య,నిమ్మల అంజయ్య, హాజీ,వసీం,గడప శ్రీనివాస్,బత్తిని చంద్రయ్య గౌడ్, బషీరుద్దీన్, మొలుగురు సదయ్య,పొనగంటి రవీందర్, వేల్పుల వెంకటేష్, వంగల విద్యాసాగర్,కర్రె పావని,ఫహాద్, అంజయ్య, నాగుల సతీష్,కుంభాల రాజకుమార్, సుదర్శన్, కృష్ణ గౌడ్,గడ్డం శ్రీరామ్, అమీర్, కోడూరు రవీందర్ గౌడ్,కోట శంకర్,శిల్ప, మాజీద్ అలీ ఖాన్,శ్రీరాముల రమేష్, మన్నే జ్యోతి,పెంట శేఖర్,మూల జైపాల్, లాయికు, చిట్టుమల్ల రవీందర్,ఇమ్రాన్,మాలోతు మహాలక్ష్మి,ముల్కల కవిత, ముక్క భాస్కర్,ఆరిఫ్,కలిముద్దీన్, హస్తపురం తిరుమల, అందే శంకర్, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,తిరుపతి రెడ్డి,పాషా, పోరండ్ల రమేష్,కొలగాని అనిల్,మూల కృష్ణారెడ్డి, కంకణాల అనిల్,చిట్టుమల్ల రవీందర్,నూనె గోపాల్ రెడ్డి,తోట అంజయ్య,హస్త పురం రమేష్, మీసారామాదేవి,హస్త పురం తిరుమల,మాదాసు శ్రీనివాస్, షబానా మహమ్మద్,ఊకంటి రవీందర్ రెడ్డి,కలిముద్దీన్,కొండా హరీష్ పాల్గొన్నారు.

## స్వర్గీయ మాజీ ప్రధానమంత్రిరాజీవ్ గాంధీ వర్ధంతి

### హత్నూర మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ



నర్సాపూర్ (వాయిస్ టుడే): గురువారం మండల పరిధిలోని దౌల్తాబాద్ ఆటో స్టాండ్ వద్ద శ్రీ స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గారి వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హత్నూర మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రె కృష్ణ తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి జిల్లా గ్రంథాల చైర్మన్ సువాసిన్ రెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నారుఈ సందర్భంగా హత్నూర మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ హత్నూర మండల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచులు మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మాజీ ఎంపిటిసిలు వార్డు సభ్యులు భారీ ఎత్తున వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.



## ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 20 (వాయిస్ టుడే) : ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను పోతిరెడిపల్లె గ్రామంలో పర్యవేక్షించిన మండల వ్యవసాయ అధికారి మరియు తహసిల్దార్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి రైతు విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు లేనియెడల ప్రభుత్వ పథకాలు పీఎం కిసాన్ భవిష్యత్తులో నిలిచే అవకాశం ఉంది అలాగే యూరియా బుకింగ్ లో కూడా ఇబ్బందులు ఎదుర్కొనవచ్చు కావున ప్రతి ఒక్క రైతు తమ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి లేదా మీ సేవలో నమోదు చేసుకోగలరని కోరడం జరిగింది. ఏఈఓ వీణ మరియు రైతులు పాల్గొన్నారు.



## ఆన్లైన్ మందులు విక్రయ వ్యవస్థను వెంటనే రద్దు చేయాలి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 20 (వాయిస్ టుడే) : పిట్లం:మందులపై ఆన్లైన్ మందులు విక్రయ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ, పిట్లం మండల కేంద్రంలోని మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా మెడికల్ అసోసియేషన్ నాయకులు కుమ్మరి యాదగిరి మాట్లాడుతూ, మందులపై ఆన్లైన్ వ్యాపారాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, మందులపై ఆన్లైన్ విధానాన్ని పెట్టడం వల్ల ఆర్థికంగా మెడికల్ షాపుల నిర్వాహకులు నష్టపోతున్నారని, ఈ విధానాన్ని తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈ యొక్క ఆన్లైన్ మందులు విక్రయాన్ని రద్దుచేసి మెడికల్ షాపుల నిర్వాహకులను ఆదుకోవాలని ఆయన కోరారు. లేదంటే ఈ యొక్క ఉద్యమం దేశవ్యాప్తంగా ఉధృత్తంగా చేయడానికి ఆల్ ఇండియా మెడికల్ యూనియన్ సభ్యులు సిద్ధంగా ఉన్నారు అని అన్నారు. పిట్లం మండల అధ్యక్షులు నానోజి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ యొక్క బందుకు పలు సంఘాలు ఆర్.ఎం.పి.ఎం.పి వైద్యులు సహకరించి సంఘీభావం తెలిపినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. అనంతరం తహసిల్దార్ మహేందర్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో, పిట్లం మండల ఉపాధ్యక్షులు పడిగల ఆనంద్ కుమార్, రామ గౌడ్, రమణ గౌడ్, కృష్ణ, విక్రమ్, బద్రి, వెంకటరెడ్డి, సాయిలు, దుర్గ ప్రసాద్, బలరాం రెడ్డి, శేఖర్ రెడ్డి, కలీం, రాజు, అంజి, ప్రభాకర్ రెడ్డి, కిరణ్, వంశీ, రఘుపతి రెడ్డి, పాల్గొన్నారు.



## రాంపూర్‌లో జొన్నల కొనుగోలు పెంచాలని రైతుల ధర్నా

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 20 (వాయిస్ టుడే) : రాంపూర్(కలన్) గ్రామ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు పరిమితిని 10 క్వింటాళ్ల నుంచి 20 క్వింటాళ్లకు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, 10 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను వెంటనే రద్దు చేసి 20 క్వింటాళ్లు కొనుగోలు చేసేలా కొత్త జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ధర్నాను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఐ.కె.పి వివోఏలకు కనీస వేతనం 20,000 ఇవ్వాలి



ముదిగొండ, మే 20 వాయిస్ టుడే: మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట గత మూడు రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్న ముదిగొండ మండల ఐకెపి వివోఏ లకు బిఆర్ఎస్ ముదిగొండ మండల కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది శాంతియుతంగా నిరసన జరుగుతున్న ఈ కార్యక్రమాలలో పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు బంకా మల్లయ్య పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో వివోఏ కనీస వేతనం ఒకటని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్లయిన కెసిఆర్ ఇచ్చిన గౌరవవేతనం 5,000 అదే కొనసాగుతున్నది తప్ప ఈ ప్రభుత్వం వారికి ఎటువంటి వేతనాలు పెంచలేదన్నారు సంపద సృష్టించి పేదలకు పంచుతామన్న నేతలు ఎక్కడున్నారో వీరు గోడు పట్టించుకోవాలన్నారు సంపద సృష్టించకపోగా వారు వారి కుటుంబానికి అతి పెద్ద సంపద రోజురోజుకీ వచ్చి పడుతుందనీ తీవ్రంగా విమర్శించారు డ్వాక్రా రుణాలు వాటి వసూళ్లు ఈ ప్రభుత్వానికి అతి పెద్ద వనరు అన్నారు అటువంటి సృష్టించిన వనరులో అందులో వీరికి కనీస వేతనం ఎందుకు ఇవ్వలేదు అని వారు ప్రశ్నించారు ఒక మహిళా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం వీరికి వేతనాలు పెంచలేదని అందుకే ఉసురు తగిలి ఆ ప్రభుత్వం పోయిందన్న ఆమె ఇప్పుడు ఎందుకు వివోఏలు ఆమెకు గుర్తుకు రావడం లేదు అన్నారు 2028లో కాంగ్రెస్ కు గత్తరే తగులుతుందన్నారు దేశంలో కాంగ్రెస్ ఓడిపోతుందని గుర్తు చేశారు తెలంగాణలో కూడా అదే జరుగుతుందన్నారు ఈ సందర్భంగా వారితో నినాదాలు చేయించారు ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకురాలు దమ్మాలపాటి శారద, సుహాసిని, పద్మారాణి, విజయ పలువురు వివోఏలు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడం అభినందనీయం

### హత్నూర మండల్ తెలంగాణ ఉద్యమకారుల సంఘం హత్నూర మండల్ ఉపాధ్యక్షులు మారుతి రాజు



నర్సాపూర్ (వాయిస్ టుడే): మల్లీ దశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు తెగించి పోరాడిన అసలైన ఉద్యమకారులను గుర్తించి ఒక కమిటీ వేయడం అభినందనీయమని తెలంగాణ ఉద్యమకారుల సంఘం హత్నూర మండల ఉపాధ్యక్షులు బట్టు మారుతి రాజు ఒక ప్రకటనలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ప్రాణాలు ప్రాణంగా పెట్టి తెలంగాణ తెచ్చానని గొప్పలు చెప్పుకున్నాడు తప్ప ఉద్యమకారులకు చేసిందేమి లేదని ఆయన చేశారు ఏనాడు ఉద్యమకారుల సంక్షేమ పట్టించుకున్నపాపాన పోలేదని ఆయన మండిపడ్డారు కాంగ్రెస్ ప్రభుత్వం మల్లీ దశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు ప్రాణంగా పెట్టి పోరాడిన అసలైన ఉద్యమకారులను గుర్తించి ఒక కమిటీ వేయడం ఎంతో గర్వకారణం అన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉద్యమకారుల తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు



## మొబైల్ ఫోన్లు దొంగిలించిన వ్యక్తులను అరెస్టు చేసిన హత్నూరఎస్సై శ్రీధర్ రెడ్డి

నర్సాపూర్ (వాయిస్ టుడే): హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలో దౌల్తాబాద్ బస్టాండ్ వద్ద బస్సు ఎక్కుతున్న సమయంలో ఓ మహిళ బ్యాగులో ఉన్న వివో మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు ఈ విషయంపై బాధ్యతరాలు భర్త మాల విక్రం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు దర్యాప్తులో భాగంగా దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు అనుమానితులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నామని హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు ఆయన మాట్లాడుతూ బస్ స్టాప్ లో రన్నింగ్ బస్సులో ప్రయాణికుల వద్ద నుండి మొబైల్ ఫోన్లను దొంగిలిస్తున్నట్లు ఒప్పుకున్నారు నిందితులు బోనగిరి జిల్లా చౌటుప్పల్ బస్టాండ్ లో సిద్దిపేట జిల్లా వట్టి మామిడి బస్టాండ్ లో మరియు అదేవిధంగా మెదక్ జిల్లా నర్సాపూర్ బస్టాండ్ లో దొంగతనం చేసిన ఫోన్లు కూడా రికవరీ చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు దొంగతనం పాల్పడిన వ్యక్తులు ఏ వన్ బేడంపల్లి ఎల్లప్ప తండ్రి షాకిరప్ప వయసు 33 సంవత్సరాలు కులం బోయ వృత్తి ఆటో డ్రైవర్ ఆయన నివాసం తారక నగర్ డోన్ మండలం, కర్నూలు జిల్లా ప్రస్తుతం నివాసం హనుమాన్ గల్లి ఎల్బీనగర్ లో ఉంటున్నట్టు గుర్తించారు ఎటు శ్రీనివాసరావు తండ్రి లక్ష్మీనారాయణ 25 సంవత్సరాలు కులం గౌడ్ మృతి వ్యవసాయం గుంటూరు జిల్లా ప్రస్తుతం నివాసం హనుమాన్ గల్లి ఎల్బీనగర్లో నివాసముంటున్నట్టు గుర్తించారు నిందితుల వద్ద నుండి మొత్తం ఏడు మొబైల్ ఫోన్లు వివో రెడ్మి ఒప్పో నోకియా నవ్య మెట్రో వీటి విలువ సుమారు 85 వేల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేశారు అలాగే ఈ నేరానికి ఉపయోగించిన టిఎస్ 27 టి 5328 నెంబర్ గల బజాజ్ ఆటో కూడా సహజనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు వీరిపై మొత్తం తొమ్మిది కేసులు నమోదు అవ్వడం జరిగింది ఇద్దరు నిందితులు అలవాటుగా బస్టాప్ ల వద్ద గుంపులో ఉన్న ప్రజలను ఆసరాగా చేసుకొని మొబైల్ ఫోన్లు దొంగిలిస్తూ జీవనం కొనసాగిస్తున్నట్లు వారు గుర్తించారు నిందితులను అరెస్టు చేసి జూడిసిఎల్ ఫస్ట్ రిజిస్ట్రేషన్ ఫోటో జిన్నారం ముందు హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ పంపడం జరిగిందని ఆయన తెలిపారు అంతేకాకుండా ప్రయాణికులు బస్సు రద్దీ సమయంలో ఎక్కేటప్పుడు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి సూచించారు

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
గురువారం 21 మే 2026

# రైతులను నిలువునా దోచుకుంటున్న బ్రోకర్ కాంగ్రెస్!

**మిల్లర్లతో కుమ్మక్కై ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్‌గా మార్చి దోపిడి**

**కొర్రీలతో అఫీషియల్ గా కొత్త తరహా దోపిడీకి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ తెరలేపింది**

**రైతాంగాన్ని ఇంతలా దోచుకుంటున్నందుకు కాంగ్రెస్ సర్కార్‌కు సిగ్గుండాలి**

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి.**



కరీంనగర్,మే 21(వాయిస్ టుడే): ఆరుగాలం రైతు కష్టించి పండించిన పంటను కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని ఇబ్బందుల గురి చేస్తుందని,ప్రధానంగా నాణ్యమైన ఏ గ్రేడ్ పంటలను సైతం బి గ్రేడ్ గా మార్చడం ,తాలు,తరుగు పేరిట కోతలు విధించి కాంగ్రెస్ సర్కార్ మిర్రర్లతో కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేస్తు,కాంగ్రెస్ పెద్ద బ్రోకర్ గా మారిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు.కొత్తపల్లి మండలంలో పంట కొనుగోలు కేంద్రాలను స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి గంగాడి కృష్ణారెడ్డి పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక అధికార యంత్రాంగం తీరు పై ధ్వజమెత్తి మాట్లాడారు.నాణ్యమైన ధాన్యాన్ని కూడా కావాలనే 'బి-గ్రేడ్'గా మారుస్తూ,క్వింటాల్‌కు రూ. 20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారని మండిపడ్డారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం మిల్లర్లతో కొమ్మక్కై రైతులను నిలువునా ముంచే కొత్త తరహా దోపిడీకి తెర లేపిందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించారని,దీనివల్ల 17శాతం ఉండాల్సిన తేమ శాతం 11 శాతానికి పడిపోయిందన్నారు.దీనివల్ల రైతులు క్వింటాల్‌కు అదనంగా 7 కిలోల ధాన్యాన్నినష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్‌సీఐ నిబంధనల కంటే తాలు తక్కువగా ఉన్నప్పటికీ, అధికార పార్టీ అండతో మిల్లర్లుచెలరేగిపోతున్నారని ఆయన ధ్వజమెత్తారు.గత పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో సంచికి 5-6 కిలోల తరుగు తీసి రైతులకు అన్యాయం చేసిందని, కాంగ్రెస్ కూడా అదే బాటలో ప్రయాణిస్తుందని,అంతకంటే ఎక్కువ మొత్తంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తున్నందుకు సిగ్గుండాలన్నారు. జిల్లావ్యాప్తంగా పంట కొనుగోలు మందకొడిగాకొనసాగుతున్నాయని , రైతులకు పంటపై ఏలాంటి ఆంక్షలు , కోతలు విధించకుండా పంట కొనుగోళ్ళను చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రధానంగాఎలాంటి తాలు,తరుగు కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలనీ,కొనుగోలు కేంద్రాలకు లారీల సంఖ్యను వెంటనే రెట్టింపుచేయాలని, నాణ్యమైన ధాన్యాన్ని బి-గ్రేడ్ కింద కొంటున్న మిల్లర్లపై,బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సివిల్ సప్లై అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని,చీటింగ్ కేసులు నమోదు చేయాలనీ ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.అలాగే అకాల వర్షాలతో రైతాంగం పంట నష్టపోకుండా టార్పాలిన్ లను సరఫరా చేయాలని,కాటా చిట్టి ప్రకారమే పేమెంట్ చేయాలని,బి కేటగిరి మోసాలను అరికట్టాలని, రవాణా సౌకర్యం మెరుగుపరచాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయంలో మండల అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజిరెడ్డి సర్పంచులు కోమటిరెడ్డి అంజన్ కుమార్ నునుగొండ మానస ప్రవీణ్ ఉప సర్పంచ్ అరే నరేష్ కట్ల వెంకటేష్ సీనియర్ నాయకులు గుంజేటి శివకుమార్ జవ్వాజి రమేష్ కించ శేఖర్ సోమిరెడ్డి సత్యనారాయణరెడ్డి కడార్ల రతన్ కుమార్ కట్ల శ్రీనివాస్ సోమినేని కరుణాకర్ ఇల్లెందుల ఆనంద్ మెరుగు మల్లేశం బైరెడ్డి వంశీ కూరగాయల మల్లేశం పాల శీను తదితరులతోపాటు వివిధ గ్రామాల భూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లారీలో అకస్మిక అగ్నిప్రమాదం

**అప్రమత్తతతో బయటపడ్డ డ్రైవర్, క్లీనర్..**




సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా మే-20 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మండల కేంద్రంలోని రైస్ మిల్లుల సమీపంలో మట్టి లోడ్ తో కరీంనగర్ వైపు వెళ్తున్న లారీలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. తీవ్రమైన ఎండల కారణంగా సుల్తానాబాద్ పైపు నుండి కరీంనగర్ వైపు వెళ్తున్న లారీలో ఆకస్మాత్తుగా ఇంజన్ నుండి అధిక వేడికి మంటలు చెలరేగడంతో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ అప్రమత్త మై లారీలో నుండి తక్షణమే దూకి తమ ప్రాణాలను రక్షించుకున్నారు. లారీలో మంటలు చెలరేగి క్యాబిన్ పూర్తిగా దగ్ధమైపోయింది. దీంతో చుట్టుపక్కల ఉన్న రైస్ మిల్లులోని వివిధ కార్మికులు మంటలు ఆర్పి వేసేందుకు చర్యలు చేపట్టారు. ఎండ తీవ్రత వల్ల అగ్నిఖిలలు ఎగిసిపడడంతో తీవ్ర వేడి ప్రభావం రాగా ఆపే ప్రయత్నం చేసినవారు సైతం వేడిని తట్టుకోలేకపోయారు. ప్రాణా నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్ మంటలను ఆర్పి వేయించి రోడ్డు పై ఉన్న లారీని పక్కకు తప్పించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

## పిట్లం మండలంలో 50% సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 20 (వాయిస్ టుడే) : పిట్లం మండల రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచింది. మండలానికి కేటాయించిన 200 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ౹ాజా పిట్లం, తిమ్మానగర్, చిన్న కొడప్గల్ సహకార సంఘాల్లో నిల్వ ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి వినోద్ తెలిపారు. జీలుగ విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్తో సహకార సంఘాలను సంప్రదించాలని సూచించారు. రైతులకు 2.5 ఎకరాలకు ఒక బ్యాగ్ (30 కిలోలు) చొప్పున విత్తనాలు అందజేస్తామని తెలిపారు. ఒక్క బ్యాగ్ సబ్సిడీ ధర లిలిరూ.2453/-లిలిగా నిర్ణయించినట్లు చెప్పారు. మండలంలోని రైతులు ఏ సహకార సంఘంలోనైనా విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి రెడ్డి వెంకట్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసీ రోడ్లకు నిధులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే**



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 20: రోడు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని బుధవారం హైదరాబాద్ లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువా తో సత్కరించారు.. తెలంగాణ రాష్ట్రములో రోడ్ల అభివృద్ధి కి పెద్ద మొత్తం లో హామ్ పథకం లో నిధులు ఇచ్చిన మంత్రి ఆయురారోగ్యాలతో ఉండి రాష్టాన్ని అభివృద్ధి పథం లో తీసుకెళ్లి మరింత పేరు ప్రతిష్టలు పొందాలని ఎమ్మెల్యే పటేల్ ఆకాంక్షించారు.. హామ్ పథకం లో నియోజకవర్గం లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు..ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో పలు రోడ్లకు నిధులు ఇవ్వాలని కోరారు.

## పిట్లం మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం




వాయిస్ టుడే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 20 పిట్లం, మే 20: పిట్లం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. రైతులు తమ జొన్నలను ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాకూర్ వెంకట్ రెడ్డి, ఎన్‌సీఈఓ సంతోష్ రెడ్డి పాల్గొని కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ రామ్ రెడ్డి, మోహన్ రెడ్డి, బుడాల నవీన్ కుమార్‌తో పాటు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిఈఓ భాగ్యలక్ష్మి ఆకస్మిక ఎంపీపీ కార్యాలయం తనిఖీ



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 20: నిర్మల్ జిల్లా తాండూర్ మండలం ప్రజా పరిషత్ ఎంపీపీ కార్యాలయాన్ని జిల్లా సీఈఓ. బి భాగ్యలక్ష్మి బుధవారం 2026-05-20 ఆకస్మికం గా సందర్శించారు. కార్యాలయం నిర్వహణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి స్థానిక అధికారులతో అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సిబ్బంది పాల్గొన్నారు



## గంజాయి విక్రయిస్తున్న నిందితుడు అరెస్ట్ .. రిమాండ్‌కి తరలింపు

**నిందితుని వద్ద నుండి ఒక కిలో గంజాయి స్వాధీనం**

**నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్**

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 20: నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారంతో ఖానాపూర్ మండలం రామరెడ్డిపల్లి బస్ స్టాప్ సమీపంలో ఆకస్మిక దాడి నిర్వహించి,బీహార్ రాష్ట్రానికి చెందిన మనీష్ పాస్వాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. నిందితుడి వద్ద నుండి ఒక కిలో (లక్ష రూపాయల విలువ) గల గంజాయి,ఒక రియల్‌మీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగింది.విచారణలో నిందితుడు బీహార్ రాష్ట్రం నుండి గంజాయి తీసుకువచ్చి ఖానాపూర్ ప్రాంతంలో చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ దాడిని స్వాధీనం,విచారణ ప్రక్రియ మొత్తం కూడా ఈ-సాక్ష్య యాప్ ద్వారా వీడియో చిత్రీకరణ చేయడం జరిగింది.నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మాదకద్రవ్యాల వ్యాపారం, సరఫరా,గంజాయి సాగుపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ కేసును విజయవంతంగా ఛేదించిన నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఖానాపూర్ సీఐ అజయ్ ఎస్ఐ రాహుల్, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.



## బక్రీద్ పండుగ సందర్భంగా హిందూ మత పెద్దలతో సమావేశం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 20: రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు ఈరోజు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టణ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, ఎస్ఐ లు సుమాంజలి,జ్యోతిమని,హిందూ మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పండుగ సమయంలో పరస్పర గౌరవ భావనతో వ్యవహరించాలని, ఎలాంటి అపోహలు, వదంతులు నమ్మవద్దని సూచించారు.సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు షేర్ చేయవద్దని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని అధికారులు సూచించారు. ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు లేదా డయల్-100 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన నూతన ఆర్డీఓ



వాయిస్ టుడే ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా : ఇటీవల వేములవాడ ఆర్డీవో గా బదిలీపై వచ్చిన కె.ఎస్. బి కుమారి బుధవారం వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేశారు.

# బి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి

**ఉపాధి హామీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో**

**కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చిన నాయకులు**




నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 20: కేంద్ర బిజెపి సర్కార్ తీసుకువచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరుతూ అవినీతిని అరికట్టాలని లక్ష్మణ్ చందా మండలంలోని ఫీచర గ్రామంలో ఉపాధి పనీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని పనులు చేయకుండానే ఫోటోలు దిగిపోతున్నటువంటి దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వడం జరిగింది. వి బి జి రామ్ జి చట్టం వలన వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ పనులలో నష్టాలను చవిచూస్తున్నారు. ఇప్పటికే ఐ క్యాప్చర్‌తో ఫోటోలు రానటువంటి వాళ్ళు ఉపాధి హామీ పనులకు దూరమయ్యారు. ఫోన్ నెట్వర్క్ లేనటువంటి గ్రామాలలో ఉపాధి హామీ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. నెట్వర్క్ లేని గ్రామాలలో ఫోటోలు లేకుండానే ఉపాధి హామీ పని కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం . కొందరు వ్యక్తులకు ఐరిష్ ఫోటోలు రాకపోవడంతో పనులకు దూరం అవుతున్నారు .అలాంటి వారిని గుర్తించి వారికి పని కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. రోజు కూలి 800 రూపాయలు చెల్లించాలని సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని పనిముట్లు గడ్డపార తట్ట పారా కొనుగోలు చేసి ఇవ్వాలని 15 రోజులకు ఒకసారి వేతనం చెల్లించాలని డిమాండ్ చేయడం జరిగింది పీచర గ్రామంలో మంగలి పని చేసే వ్యక్తి ఉపాధి హామీ పనికి వెళ్లి ఆరు గంటలకు ఒక ఫోటో దిగి తర్వాత ఎనిమిది గంటల తర్వాత మంగళ్ షాపులో కటింగ్ తీస్తున్న ఫోటోను ప్రజల ముందు ఉంచుతున్నాం. ప్రభుత్వం దృష్టికి తీసుకు వస్తున్నాం. పీచర గ్రామంలో ఈ విధంగా పనులు కొనసాగుతున్నవి .మేము ఇప్పటికే రెండుసార్లు కలెక్టర్ గారికి దరఖాస్తులు ఇచ్చి ఉన్నాం. ఇదే విషయంపై కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు పీచర గ్రామంలో జరుగుతున్నటువంటి ఉపాధి హామీ అవినీతిపై ఈ కలెక్టర్ గారైన స్పందించి నిజ నిర్ధారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్ ను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం .

పేదలు కష్టజీవులు పనులు చేయకుండా డబ్బులు తీసుకోవడం అనేదానికి వ్యతిరేకం కానీ గ్రామాలలోని కొందరు పెత్తందారులు రాజకీయ పలుకుబడి కలిగినటువంటి వారు పనులు చేయకుండా ఫోటోలు దిగి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. విధి లేని పరిస్థితుల్లో పేదలు సైతం వారానికి 300 రూపాయలు చెల్లించి పనులు చేయకుండా ఫోటోలు దిగి డబ్బులు తీసుకోవడానికి సిద్ధపడ్డారు. గ్రామాల్లో జరుగుతున్న ఇలాంటి అవినీతిని ప్రజలందరూ వ్యతిరేకించాలని ఈ అవినీతి ఇలాగే కొనసాగితే ఉపాధి హామీ పని మొత్తం అవినీతిమయమైంది కావున ఉపాధి హామీ పనులు బందు చేస్తామని ప్రభుత్వాలు నిర్ణయాలు చేస్తాయి .ప్రభుత్వ అధికారులకు గ్రామాలలో ఉపాధి పని ఏవిధంగా కొనసాగుతుందో తెలిసినప్పటికిని డబ్బుకు దాసోహమై అవినీతికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.గ్రామ సెక్రటరీలు పనులు ఏ విధంగా జరుగుతున్నాయో చూడాలని లేనియెడల అవినీతి జరుగుతున్న గ్రామంలో గ్రామ సెక్రెటరీని సస్పెండ్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లిదుర్గం నూతన కుమార్జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతిఉపాధ్యక్షులు లిబరుక్కుంట గంగారంలి జిల్లా కార్యదర్శి లికే శ్రీనివాస్‌లి నాయకులు పానుగంటి నరేష్ కుమార్ ,దూడ నరసరాజు పాల్గొన్నారు.

# అర్హులకు ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బీఎల్ఏలను నియమించి బూత్ స్థాయిలో రాజకీయ పార్టీలు పర్యవేక్షణ చేయాలి**

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



వాయిస్ టుడే ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా : జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమావేశం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అక్టోబర్ 1, 2026ను ప్రమాణిక తేదీగా తీసుకుని అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుత ఓటర్ల జాబితాను 2002 నాటి ఎస్ఐఆర్ ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నామని తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని పేర్కొన్నారు. జూన్ మొదటి వారంలో మండల స్థాయిలో బీఎల్వోలు, బీఎల్ఏలతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 15 నుంచి 24 వరకు ఎస్ఐఆర్‌లో పాల్గొనే బీఎల్వోలు, ఇతర సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త ఓటర్ల నుంచి నమోదు ఫారాలు స్వీకరిస్తారని తెలిపారు. 2002 ఎస్ఐఆర్ జాబితాలో లేని ప్రతి ఒక్కరూ తిరిగి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇంటింటి సర్వే సమయంలో బీఎల్వోలకు బీఎల్ఏలు సహకరించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని, సరైన పత్రాలతో ఫారాలు నింపడంలో సహాయం చేయాలని సూచించారు. మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓట్లు, రెండు చోట్ల ఓటు ఉన్న వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సరిగా కాకపోతే ఎన్నికల అధికారులు సంబంధిత వారికి నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. ఆ సమయంలో భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం పుట్టిన సంవత్సరాన్ని ఆధారంగా తీసుకుని అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1, 2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలని, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన బీఎల్వో ఎవరో ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇల్లు తాళం వేసి ఉంటే బీఎల్వోలు మూడు సార్లు సందర్శిస్తారని చెప్పారు. ఓటర్లు ఒశీవతీ.వఎఱ.స్ర్శీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూరించవచ్చని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఫారం-6 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కే ఎస్ బీ కుమారి, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## వెల్మల్ బొప్పారంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రత్యేక కార్యక్రమం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 20: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్మల్ బొప్పారం లో ప్రొ జయశంకర్ బడిబాట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన వెల్మల్ సర్పంచ్ రాచకొండ సాగర్ బొప్పారం సర్పంచ్ దేశెట్టి నరేష్ రేపు పాఠశాల ప్రధానోపాధ్యా నాలం విద్యాసాగర్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కొండూరు పోతన రచించిన బడిబాట ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ పాటని వినిపిస్తూ గ్రామంలోని ప్రధాన కూడలుల గుండా వెల్మన్ గ్రామంలో దాదాపు 350 మంది ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి గ్రామ సర్పంచ్ రాచకొండ సాగర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నాను పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు నోట్బుక్లు సమరూప దుస్తులు ఇస్తుందని వారానికి మూడు కోడి గుడ్లు పెడతారని ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని మేమందరం ఇదే పాఠశాలలో చదువుకున్నామని మేము చదువుకునేటప్పుడు యిన్ని రకాల వసతులు ఉండేవి కావని ఇప్పుడు అన్ని రకాలుగా వసతులు ప్రభుత్వం కలిపిస్తుందని గ్రామంలోని ప్రైవేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే ఎక్కువ మార్కులు 528 వచ్చాయని ప్రైవేట్ పాఠశాలలలో ఫీజులు కట్టి చదివే బదులు ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలందరినీ చేర్పించి చక్కగా చదువుకోవాలని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ సంవత్సరం మా పాఠశాలలో పదవ తరగతిలో 100% రిజల్ట్ సాధించామని 57 విద్యార్థులకు 57 గురు ఉత్తీర్ణులయ్యారని తెలియజేశారు. 2026 జేఈఈ మెయిన్స్లో మా పాఠశాలలో చదివిన వర్ధిని రెడ్డి జాతీయస్థాయిలో 211 సాధించిందని ప్రైవేట్ పాఠశాలకు ఏమాత్రం తీసిపోని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని తప్పకుండా మీ పిల్లలందరినీ మా పాఠశాలలో చేర్పించాలని పిల్లలకు చదువు చెప్పించే బాధ్యత నేను తీసుకుంటానని హామీ ఇచ్చారు. తరువాత బొప్పారం గ్రామంలోని ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి అక్కడివారిని ఉద్దేశించి గ్రామ సర్పంచ్ దేశెట్టి నరేష్ మాట్లాడుతూ మీ పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పాఠశాలను క్రమం తప్పకుండా మేము పర్యవేక్షిస్తూ మీరు పిల్లలందరికీ చదువు వచ్చే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని నేను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నానని ప్రైవేటు పాఠశాలలో చేర్పించి అప్పుల పాలు కావద్దని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వెల్మల్ ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు ఉపాధ్యాయులు కొప్పుల లక్ష్మణ్ లింగారెడ్డి కొండూరు పోతన్న రాజ మహేందర్ భారతి రమాదేవి సౌజన్య కవిత వెల్మల్ గ్రామ కార్యదర్శి భూపాల్ రెడ్డి బొప్పారం కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## ముస్లిం మత పెద్దలతో పోలీసుల సమావేశం

ఖమ్మం , మే 20 (వాయిస్ టుడే): రానున్న బక్రీద్ పండుగను శాంతియుతంగా, మత సామరస్యంతో జరుపుకోవాలని టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ముస్లిం మత పెద్దలతో, మసీదు కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఏసీపీ మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణ, పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, సామరస్య వాతావరణం ఉండేలా చూడాలని పోలీసులు ముస్లిం పెద్దలను కోరారు. అక్రమ పశువుల రవాణాను అరికట్టడానికి చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిఘా ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలకు లోబడి, సరైన ధృవీకరణ పత్రాలతో మాత్రమే జంతువులను తరలించాలని సూచించారు. గోవధ చేయవద్దని, కేవలం అనుమతించబడిన జంతువులను మాత్రమే బలి ఇవ్వాలని సూచించారు. అదేవిదంగా జంతు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, మున్సిపల్ అధికారుల సహకారంతో వాటిని తొలగించాలని, శుభ్రత పాటించాలని కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వార్తలు, వదంతులు వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ కరుణాకర్,మోహన్ బాబు, బాలకృష్ణ, ఎస్సై లు పాల్గొన్నారు.



## చరిత్ర తిరగరాయాలి కేసిఆర్‌ను సీఎం చేయాలి

**పార్టీ సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పని చేయాలి - మాజీ ఎంపీ నామ**

**యావత్ తెలంగాణ ప్రజలు కేసీఆర్ రావాలి... కాంగ్రెస్ పోవాలి అంటున్నారు - మాజీ ఎంపీ నామ**

ఖమ్మం, మే 20( వాయిస్ టుడే ): కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి బలం అని కార్యకర్తలు, నాయకులే బలగమని అని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం నాడు ఖమ్మంలోని తెలంగాణ భవన్ నందు ఎమ్మెల్సీ, పార్టీ ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్ రావు అధ్యక్షతన ఖమ్మం, మధిర, వైరా, ఇల్లందు నియోజకవర్గాల సభ్యత్వ నమోదు మండల ఇంచార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలతో కలిసి మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి కేసిఆర్ చేసిన కృషిని కొనియాడారు. మరల చరిత్ర తిరగరాసి కేసిఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. లక్షలాది మంది కార్యకర్తల బలం ఒక్క బీఆర్ఎస్ పార్టీకే సొంతమన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో తాను తొలి ఓటు వేశానని, ఆ సందర్భానికి కేసిఆర్ సాక్షిగా ఉన్నారని గుర్తుచేశారు. గత రెండు దశాబ్దాలుగా ఉద్యమకారులు, కార్యకర్తలు, నాయకులు పార్టీకి అందించిన సేవలు అమూల్యమని పేర్కొన్నారు. జిల్లాలో 10కు 10 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవడం అవసరమని, అందుకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువతను చైతన్యవంతం చేయాలని, మండల ఇంచార్జ్‌లకు భవిష్యత్‌లో పార్టీ ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎలాంటి కష్టాల్లో ఉన్నా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పదవులు లేకపోయినా సేవలందిస్తున్న వారికి పార్టీ తగిన గుర్తింపు, అవకాశాలు కలిపిస్తుందని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హరి ప్రియ, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, ఆర్జేసి కృష్ణ, దిండిగల రాజేందర్, ఖమర్, మంజుల, గిరిబాబు, మండల, పట్టణ ఇంచార్జిలు పాల్గొన్నారు.

## మొక్కల పెంపు, నాటే ప్రాంతాలపై సమీక్ష సమావేశం

ఖమ్మం కార్పొరేషన్, మే 26 (వాయిస్ టుడే ): ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని హార్టికల్చర్ ఆఫీసర్ బెల్లం రాధికా ఆధ్వర్యంలో గార్డెన్ సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరాన్ని మరింత పచ్చదనంతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నర్సరీల్లో ప్రస్తుతం పెంచుతున్న మొక్కల రకాలు, వాటి సంరక్షణ విధానాలు, వర్షాకాలంలో ఏ ప్రాంతాల్లో ఏ మొక్కలు నాటాలి అనే అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. నగరంలోని డివైడర్లు, పార్కులు, ప్రధాన రహదారులు, కాలనీలు, ఖాళీ ప్రదేశాల్లో ఎక్కడ మొక్కలు తక్కువగా ఉన్నాయో గుర్తించి, ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికతో మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందుగానే అవసరమైన మొక్కలను సిద్ధం చేసి, వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే నగర సౌందర్యాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే విధంగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో నగరాన్ని మరింత పచ్చదనంతో, ఆహ్లాదకర వాతావరణంతో తీర్చిదిద్దేందుకు హార్టికల్చర్ శాఖ కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.



## టైలర్ వృత్తిపై ఆధారపడిన మేరు మహిళలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

**స్వింగ్ మిషన్ టు ఉమెన్" పథకంలో మేరు కుల మహిళలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతి**

యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి ):- టైలరింగ్ వృత్తినే జీవనాధారంగా చేసుకుని కుటుంబాలను పోషిస్తున్న మేరు కుల మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న "స్వింగ్ మిషన్ టు ఉమెన్" పథకంలో తొలి ప్రాధాన్యత కల్పించాలని యాదాద్రి భువనగిరి జిల్లా మేరు సంఘం నాయకులు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం భువనగిరిలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన సంఘం ప్రతినిధులు, తెలంగాణ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి వెయ్యి చొప్పున బీసీ మహిళలకు కుట్టు మిషన్లు మంజూరు చేస్తున్న నేపథ్యంలో నిజంగా టైలరింగ్ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న మేరు కుల మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మేరు కులానికి చెందిన అనేక కుటుంబాలు తరతరాలుగా టైలరింగ్ వృత్తినే ఆధారంగా చేసుకుని జీవిస్తున్నాయని, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న కుట్టు మిషన్లు ఎంతో ఉపయోగకరమవుతాయని తెలిపారు. అర్హులైన మహిళలకు పారదర్శకంగా పథకం అమలు చేసి న్యాయం చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.అదేవిధంగా మేరు కుల మహిళలకు టైలరింగ్ ప్రధాన జీవనాధారమని, వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమస్యపై సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా మేరు సంఘం అధ్యక్షులు కాటారం భాస్కర్, ప్రధాన కార్యదర్శి కొట్టూరి రాజమల్లప్ప, కోశాధికారి కొత్త భాస్కర్, ఉపాధ్యక్షులు కొత్త అంజనేయులు సంఘం నాయకులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ పండుగ వేడుకల్లో పాల్గొన్న బీర్ల ఐలయ్య



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సాధువెల్లి గ్రామంలో దుర్గమ్మ పండుగ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాధువెల్లి గ్రామ సర్పంచ్ ప్రసాద్ ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.. గ్రామప్రజలు అధిక సంఖ్యలో గుడి వద్దకు బోనాలు ఎత్తుకొనిఊరంతా ఆడపడుచుల సందడితో డోలు డప్పు చప్పులతో అంగరంగ వైభవంగా సాధువెల్లి గ్రామ ప్రజలు దుర్గమ్మ పండగ జరుపుకున్నారు.




## ఖమ్మం ఖిల్లాలో ఘనంగా హెరిటేజ్ వాక్

ఖమ్మం కార్పొరేషన్, మే 20( వాయిస్ టుడే ): ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ కార్యక్రమం ఘనంగా నిర్వహించామని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి మే 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాల నేపథ్యంలో ఖమ్మం ఖిల్లా నుండి జాఫర్ బావి వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించామని తెలిపారు. ఖమ్మం ఖిల్లా మెట్లు వద్ద ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్ ఖిల్లా పైభాగం వరకు కొనసాగి అనంతరం జాఫర్ బావి వరకు నిర్వహించా మనీ, విజయవంతంగా హెరిటేజ్ వాక్ పూర్తయిందనీ,కార్యక్రమంలో అనేక మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సహకారం అందించారని తెలిపారు. ఖమ్మం ఖిల్లా చారిత్రక ప్రాముఖ్యతతో పాటు జిల్లాలోని పర్యాటక అభివృద్ధి అవకాశాలపై విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించామని తెలిపారు.పర్యాటక రంగ అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్ నాయక్, టూరిజం శాఖ సిబ్బంది జె. చంద్రశేఖర్ ఆజాద్, హెరిటేజ్ విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఎంపిజె సభ్యులకు ఘన సన్మానం

ఖమ్మం కార్పొరేషన్ మే 20:(వాయిస్ టుడే ): ప్రభుత్వ ఉద్యోగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ ఎంపిజె సంస్థ అభివృద్ధికి కృషి చేసిన ఇరువురు సభ్యులకు స్థానిక ఎంపిజె కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిజె జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన సయ్యద్ నాసర్ అహ్మద్ ఇటీవల ఎంపీడీఓ కార్యాలయ సూపరిండెంట్ పదవి నుండి, ఎంపిజె జిల్లా ఉపాధ్యక్షులుగా కొనసాగిన ఎండి రజబ్ అలీ రిక్కా బజార్ పాఠశాల ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిజె జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిమ్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలతో పాటు సామాజిక బాధ్యతను సమర్థంగా నిర్వర్తించిన నాసర్ అహ్మద్, రజబ్ అలీ లు సంస్థకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలోనూ, సంఘ సేవలోనూ వారు చూపిన నిబద్ధత యువతకు మార్గదర్శకమని కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలైన సయ్యద్ నాసర్ అహ్మద్, ఎండి రజబ్ అలీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఇకపై పూర్తి సమయాన్ని ఎంపిజె సంస్థ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం కేటాయిస్తూ సేవలు అందిస్తామని తెలిపారు. సంస్థ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిజె ఉపాధ్యక్షులు ఎండి జహీర్, కోశాధికారి ఎండి హకీమ్, కార్యదర్శులు బి. సతీష్, సయ్యద్ రఫీక్, సభ్యులు షేక్ హుసేన్ మియా, ఎండి మహిముద్, ఎండి అహ్మద్, ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**